# ధిక్కారం

## కవితా సంపుటి

## శ్రీలత



# ధిక్కారం

## కవితా సంపుటి

శ్రీలత

రచన : ధిక్కారం
రచయిత్రి : శ్రీలత

ముఖచిత్రం : వలియుద్దీన్

ప్రథమ ముద్రణ : 1996
ప్రతులు : 500
వెల : 60

టైప్‌సెట్టింగ్ : ఎస్.కె.వి. ఇండస్ట్రీస్
హైద్రాబాద్

ప్రింటింగ్ : జాయ్ ఎన్ జాయ్ ప్రింటర్స్
హైద్రాబాద్

లభించు చిరునామాలు :

**SRI M. KONDAIAH** M.Sc.
1-3-159, Rajaendra Nagar,
Mahabubnagar.

Phones : Res : 42588
41968
Off : 36204, 36205, 36231

**QUALITY BOOK CENTRE**
New Town, Mahabubnagar.

చదివి స్పందించిన
ప్రతి హృదయానికి అంకితం

# మరో మహిళా ధిక్కార స్వరం

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం మొదలయి అప్పుడే ఒకటిన్నర దశాబ్దం అయిపోయింది. తెలుగు కవిత్వంలో మహిళా చైతన్యరేఖలు ''శిలాలోలిత'' (1980) అనే కవితా సంపుటిలో కొంచెం స్పష్టంగా కనిపిస్తున్నాయని సాహిత్య విమర్శకులు గర్తించారు. ధిక్కార స్వరం మాత్రం సావిత్రి ''బందిపోట్లు'' తో ఆరంభమైనట్టు చెప్పుకోవచ్చు. అప్పటినుండీ పత్రికల్లోనూ ఇతరత్రా కూడా ఈ ధిక్కార స్వరాలు అఖండంగా వినిపిస్తున్నాయి. అందులో కొన్ని ''నీలిమేఘాలు'' అనే పుస్తకంగా 1993లో సంకలిత మయ్యాయి. వైతాళికులు (1935) తరువాత వచ్చిన గొప్ప సంపుటి ఇది అని నేననందుకు కొందరు అకారణంగా ఉడుక్కున్నారు గాని తరువాత కాలమే దాన్ని ధ్రువపరిచింది.

మహద్భుత కవితా చైతన్యం ఒక సంపుటిలో ఒదిగేది కాదు. సంకలనం కవితా చైతన్యానికి ఒక గుర్తే కాని పూర్ణకొలమానం కాదు. సంపుటాలు వేయని కవులు అప్పటిలాగే ఇప్పుడూవున్నారు.

చైతన్యవంతులైన స్త్రీలు కవిత్వం రాయకుండా ఉండలేని కాలం ఇది. ఇది ఈ కాలపు అవసరం. ఇది ఈ యుగ చైతన్యం. ఇప్పుడు వస్తున్న కవులతోనూ, కావ్యాలతోనూ ఏమంత పరిచయం లేకపోయినా ఈ స్ఫూర్తిని అందుకొన్నది ఈ కవయిత్రి శ్రీలత. మహబూబ్‌నగర్ కేంద్రంగా మరో ధిక్కార స్వరం వినిపిస్తున్నది.

ఈనాటి మహిళా చైతన్య కవిత్వంలో విశేషమేమిటంటే ఏ గొంతూ మరో గొంతుకు మిమిక్రీ కాదు. ఎవరి బాణీ వారిదే. వీరిలో కొందరు స్త్రీవాదులమని చెప్పుకోవచ్చు. మరికొందరు స్త్రీవాదులం కామని ప్రకటించనూ వచ్చు. ఇంకా కొందరు ఆవాదాల గురించి స్పృహ లేని స్థితిలోనూ ఉండవచ్చు. కాని అందరి చైతన్యం ఒకలాంటిదే. గుర్తించటం కష్టంకాదు.

బయటి ప్రపంచంతో ఏమంత సంబంధం లేకుండానే స్త్రీ వేదననూ చైతన్యవంతంగా పలికించగలిగిందీ కవయిత్రి.

తోటి వారి జీవితాలను
స్పందించి చిత్రించడంలో
అమోఘమైన ఆప్యాయం

ఈమె కవిత్వానికి హేతువు. తన్ను తాను నిలవరించుకోలేని ఉద్వేగమే ఈమె చేత కవిత్వం రాయించింది.

వివాహాన్ని గురించి చాలా మంది కవయిత్రులు పలురకాలుగా చిత్రించారు. అందులో అతి సున్నితమైన కవిత కె. వరలక్ష్మి గారి ''ఆ ఇల్లు'' అనే ఖండిక. తాను ఆడి పాడిన ఇల్లు, గంతులేసిన ఇల్లు, తను కలకాలం కలలుగా భద్రపరుచుకొన్న అనుభవాల ఇల్లు ఒక్కసారిగా తనది కాదని తెలుసుకోవటం ఎంత భాదాకరమో ఆమె చిత్రించారు. ఇల్లు అంటే భౌతికమైన కట్టడం అనీకాదు. నీడకు తల దాచుకునే గూడు అనేకాదు, తన ఆలోచనలలోనూ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దిన పరిసరాలకూ మనుషులకూ సంకేతం పెంచుకున్న అనుబంధాలకు చిహ్నం. ఈ పరిస్థితినే శ్రీలత ''నాన్నా నిన్ను విడిచి'' అనే కవితలో స్త్రీకి మాత్రమే సాధ్యమైన కొత్త పోలికలతో చిత్రించిన పద్ధతి చూడండి.

''కడుపులో బిడ్డ
పేగు కత్తిరించుకు పోతున్నట్టు''
''ఆడుకుంటున్న అమ్మా నాన్న బొమ్మల్ని
ఎవరో లాక్కుపోయినట్టు''

పెళ్ళీడు రాబట్టే కదా ఇంట్లో నుంచి వలసపోవలసి వచ్చింది. అందుకని.

''వయసు కత్తిరించి
పట్టులంగా జాకెట్టు వేసుకుని
జడకుచ్చుల లయతో
నీ ప్రాంగణంలో మళ్ళీ
లేడి పిల్లనవ్వాలని''

ఉన్నదని నాన్నను సంభోదిస్తుంది. ఇది విన్న ఏశిలా హృదయమైనా కరిగిపోతుంది.

వంటింటిని మహా సామ్రాజ్యంగా, పూజలనూ, పేరంటాలను గొప్పభారత సంస్కృతిగానూ పాతివ్రత్యాన్ని ఒక ఆదర్శంగానూ చీరలనూ నగలను రివార్డుగానూ ఈ వ్యవస్థ భ్రమ పెడుతుంది. దాని నుంచి బయటపడమని

''వంటింటి ఘుమఘుమలతో
స్వర్గాలు వెతుక్కోక
శ్రావణ కార్తీక పూజల్లో
పేరంటాల ఆర్భాటంలో
పాతివ్రత్యం ప్రదర్శించక
పట్టు చీరలు నగల్తో
నిన్ను నీవు పూడ్చేసుకోక !

అని హెచ్చరిస్తుంది, ''జీవన శ్మశానం'' అనే కవితలో. స్త్రీకి శ్మశాన జీవితాన్ని మాత్రమే ఇస్తున్నదని సూటిగా చెపుతుంది.

పురుష స్వామ్య సమాజంలో తిట్లన్నీ స్త్రీలను కించపరచేవే. అవి వాడేటప్పుడు అనాలోచిదంగా వాడినా ఆలోచించే స్త్రీలను అవి ఎంత కలత పెడతాయో మాటలా అనే కవితలో చూడండి !

''ఏమగాడికి ఏ మగాడిపై
కోపమొచ్చినా, కసిరేగినా
అమాయకపు అమ్మనూ, అక్కనూ, ఆలినీ
మాటలతో చెరిచే
మృగాల రక్కసి మనసుల
మదపు అరుపులవి''
అని ఆక్రోశిస్తుంది.

వెలయాలి జీవితాన్ని స్త్రీ కోణం నుంచి కొండేపూడి నిర్మల ''నడిచేగాయాలు'' , ఘంటసాల నిర్మల, ''ఎ కాల్‌గర్ల్స్ మోనోలాగ్'' అనే ప్రసిద్ధ కవితలున్నాయి. వాటి కన్నా భిన్నకోణంలో కనిపిస్తుంది, వస్తువు అదే అయినా నిన్నొకసారి అనే కవిత ఆమె అంటుంది.

''ప్రతివాడి మురుగురూ
డ్రైనేజ్ కాలువనై
జీవిస్తూ జీవిస్తూ
ఎక్కడో చెత్తకుండీ పక్కన
ఏనాడో శవాన్నయ్యే ముందు
నిన్నొకసారి చంపాలని''

ప్రతీకార వాంఛ ప్రకటిస్తుంది.

ఆడపిల్ల పెద్దమనిషైనపుడు అమ్మ పసుపూ కుంకుమ గాజులూ, పారాణీ వగైరాలు ఏర్పాటు చేసేది అమ్మ. అయితే అవి అమ్మ పోయినపుడు పోకుండా భర్త పోయినపుడెందుకు పోవాలి ? అని అమాయకంగా కనిపించే గడుసైన ప్రశ్న వేస్తుంది. ''నువ్వుపోతే'' అనే కవితలో.

నేను సాధారణంగా కవిత్వంలో శిల్పాన్ని కోరుకుంటాను. గూఢతను మెచ్చుకుంటాను. చప్పున అర్థమయ్యే కవిత్వం చూసి కవిత్వం ఇంత త్వరగా అర్థమయితే ఎలా అని బాధపడిపోతాను. ''మో'' మార్కు పద్యాలు అర్థం కావటం లేదని గోలపెడుతుంటే కవిత్వం ఎప్పుడూ అరటిపండు వలచిపెట్టి నట్టుండాలా అని ఎదురు తిరుగుతుంటాను. ఇప్పటికీ నేను మారలేదు. అయితే సూటిగా చెప్పినా ఒక్కోసారి కవిత్వం అవుతుందని ఒప్పుకోవాలనుకుంటాను. వస్తుబలం కూడా కవిత్వ బలంగా పరిణమించగలదనుకుంటాను. ఈ పుస్తకంలో ''సీతాకోక చిలుక'' అనే ఖండిక చూడండి.

''నువ్వు ప్రాణం పొయ్యావు
శరీరాన్నివ్వావు
ఒక్క తాళిబొట్టుతో
జీవితం సొంతం చేసుకుంటావు
ఆదిపత్యం సంపాదిచుకుంటావు
హక్కులు ఆపాదించుకుంటావు''

అని ప్రకటనగా కనిపించే ప్రశ్న అడుగుతుంది. ఇదే భావం ధిక్కారం అనే టైటిల్ సాంగ్‌లాటి కవితలో కనిపిస్తుంది. పురుష స్వామ్య సమాజం అసహజమైనదని, మాతృస్వామ్య సమాజం సహజమైనదని ప్రతిపాదిస్తుంది. పుట్టుక ముందు నుంచే బిడ్డకు అణువణువూ ఇచ్చిన తల్లిని వదిలేసి తండ్రి కులగోత్రాలు బిడ్డకు ఇయ్యటమేమిటని ప్రశ్నిస్తుంది.

శ్రీలతకు కవితా శిల్పం గురించి తెలీదు. భాషా పాటవం తగినంత ఉంది కాని, ఇంకా నేర్చుకోవలసినది చాలా ఉంది. చాలా కవితల్ని ఈమె బాగా ఎడిట్ చేసుకోవలసిన అవసరం ఆమె గుర్తించాలి. కవి కలం నుంచి జారిపడ్డ ప్రతి మాట మార్చే అవసరం ఈమె గుర్తించాలి. కవికలంలోనుంచి జారిపడ్డ ప్రతిమాట మార్చే అవసరం లేకుండా గొప్ప కవిత్వం అయిపోతుందనే భ్రమ ఒకటి ఆధునిక కవితాలోకంలో ప్రచారంలో ఉంది. కాస్తో కూస్తో పేరున్న కవుల్లో, కవయిత్రుల్లోనూ కూడా ఈ భ్రమ ఉండటం గమనించాను.

శ్రీలతకు తన చుట్టూ ఉన్న సంఘాన్ని సంఘటనలను పరిశీలించే శక్తి ఉంది. ఆలోచించగలదు. స్పందించే గుణం ఉంది. సమాజంలో ఆర్తికి ఆక్రోశించే హృదయం ఉంది. వ్యవస్థలో అన్యాయాన్ని ప్రశ్నించి, ధిక్కరించే ధైర్యం ఉంది.

ఈమె ఇంతకు ముందు కవయిత్రులకన్నా భిన్న వస్తువులను గ్రహించింది. ఒకవేళ అవే వస్తువులను గ్రహించినా కొత్త కోణంలో దర్శించి ప్రదర్శించింది. ఈ కవయిత్రితో ఒకటే చిక్కు. విశ్వనాధ సత్యనారాయణగారు ఒక పద్యంలో

''దీపాతాలాతమువోలె, నా చాతము
శబ్దమేర్పడుటకు చిన్నము నిల్వదు
భావతీవ్రతన్''

అన్నట్టు ఈమెకు కూడా త్వరత ఎక్కువ. ఆవేగాన్ని కాస్త తగ్గించి నిలకడగా నింపాదిగా రాస్తే ఇంతకన్నా ఇంకా మంచి కవిత్వాన్ని రాయగలదని నా ఆశంస, ఆశీస్సు.

చేకూరి రామారావు

1996 నవంబరు 13.

## నా గురించి నేను

నా గురించి ఏమంతగా లేదు రాయడానికి. హృదయానికి మాత్రం స్పందన వుంది. రాయకుండా వుండలేని బలహీనత ఉంది. చెప్పాలనుకున్నది. పూర్తిగా చెప్పలేక పోయానేమో ఇంకా చెప్పాల్సినది మిగిలిపోయిందేమో అనే సందేహం ఉంది. ఎక్కువ పదాలు, పోలికలు నాకు తెలియవు సాహితీ ప్రపంచంలో అ.ఆలు దిద్దుతున్న దాన్ని. కొన్ని పేపర్లు పత్రికలు నా కవితలు అచ్చువేసి ఇచ్చిన ప్రోత్సాహంతో చేకూరి రామారావు గారి విమర్శల సర్దుబాటుతో ఈ పుస్తకం విడుదల చేస్తున్నాను.

స్త్రీ జన్మ మన సమాజంలో మరీ సమస్యల కూటమిగా ఉంది. సాధారణ లోకులు స్త్రీ శరీరాన్ని ఆకర్షణీయమైన వస్త్రాలంకరణనూ చూసినంతగా స్త్రీ ఆలోచనా విధానాన్ని అంతర్ ఘర్షణను దర్శించలేరు. నేనూ ఒక స్త్రీని. కనుక సామాజిక జీవితంలో అన్ని విధాల సమస్యలకూ స్త్రీ పురుషుని కంటె అధికంగా గురికాబడుతుందని నాకు తెలిసిన అనుభవం. పురుషుడు చేసే పనినే స్త్రీ చేయాల్సి వస్తే ఆమె పురుషుని కంటె రెట్టింపు మరియు ప్రత్యేకమయిన సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ సమస్యల వల్ల ఒక్కోసారి ఆమెలోని అంతర్గత శక్తి నశించిపోవడం కూడా జరగొచ్చు. ఆ పరిధులు దాటిన స్త్రీలు ఉన్నప్పటికీ వారు కొద్ది శాతం మాత్రమే. ప్రతి ఒక్కరూ ఆ కొద్దిమందిలా ఎందుకు కాలేక పోతున్నారనేది నా ఆవేదన. అణగారుతున్న స్త్రీ సామర్థ్యానికి కారణం వెతకాలన్న తపన నిరంతరం నాలో రగులుతూ ఉంటుంది. నేను చూసిన ప్రతి స్త్రీలోనూ నాకేదో ప్రత్యేకత కనిపిస్తుంది. కానీ అది అంతర్గతంగానే. దాన్ని బహిర్గతం కాకుండా చేసే పరిస్థితులను అన్వేషించడం అలవాటుగా మారి దాన్ని ప్రతిబింబించడానికి ప్రయత్నించాను. స్త్రీ తనను బలహీనపరచే భావాలనుండి తనను తానే బయటకు తెచ్చుకోవాలని చెప్పాలని కృషిచేసాను. ఇది ఇతర స్త్రీల జీవితాలను పరిశీలించిన అవగాహన.

ఆ అవగాహనతో స్త్రీలో రగులుతున్న, బయటపెట్టలేని కొన్ని భావాలకు టార్చిలైట్ వేసి వెలుగులో చూపి కొందరికైనా పరిపూర్ణ స్త్రీ స్వభావం అర్థం అయ్యేలా రచన చేయాలని, నేను చేసిన ఈ ప్రయత్నం ఒక ప్రయోగం మాత్రమే. నా సృజనశక్తికి ఒక పరీక్ష మాత్రమే. ఇందులో నేను సఫలం అయ్యానో లేదో నిర్ణయించాల్సింది పాఠకులే కనుక సహృదయులెవరైనా నారచనకు స్పందిస్తే నేను పొందే ఆనందానికి హద్దు ఆకాశం మాత్రమే.

అన్ని రంగాలలో వలెనే స్త్రీకి సాహిత్యరంగంలో కూడా అసౌకర్యం ఎక్కువ. రాసినవి ఎప్పటికప్పుడు కవి మిత్రులకు వినిపించే అవకాశం కలుగలేదు. కవి మిత్రులే దొరకని దూరంలో ఉండటం వలన.

ఇంతటితో సరి.

నన్ను మొట్టమొదటిసారి కవయిత్రిగా గుర్తించి ప్రోత్సహించిన నరసరావు పేట ఎం.పి. కోటసైదయ్య గారికి,

అర్థమయితే కవిత్వమే కాదు అని భీష్మించుకున్న చేకూరి రామారావుగారు సూటిగా చెప్పినా కవిత్వం కావచ్చేమో అని ఒప్పుకుని ధిక్కార స్వరాన్ని పరిచయం చేసినందుకు,

నా కవితలు మెచ్చుకుని పుస్తకం రూపంలో వేయమని ఒత్తిడి తెచ్చిన విరివింటి పద్మాపరుశురాం దంపతులకు,

నాపుస్తకాన్ని ఉర్దూలోకి అనువాదం చేసిన కుతుబ్ సర్వార్‌గారికి,

నాకు అన్ని విషయాలలో సలహాలిచ్చే అడ్వకేట్ సి.యస్. కుమార్ గారికి,

నను కవయిత్రిగా మారడానికి రెచ్చగొట్టిన ఈ సామాజిక వ్యవస్థకు మాత్రం బాధతో,

మనసా వాచా కర్మణా కృతజ్ఞతలు.

**శ్రీలత**

# మునుముందు


| | | |
|---|---|---|
| 1. | సాహితీలోకం | 1 |
| 2. | ధిక్కారం | 2 |
| 3. | నాన్నా నిన్ను విడిచి.... | 5 |
| 4. | జీవన శ్మశానం | 7 |
| 5. | మాటలా | 9 |
| 6. | నిన్నొక్కసారి...... | 11 |
| 7. | నువ్వుపోతే ...... | 13 |
| 8. | చేయగలవాడె | 14 |
| 9. | కలలబదులు | 15 |
| 10. | చరిత్రకెక్కని బ్రతుకులు | 17 |
| 11. | ఎందుకంటె | 19 |
| 12. | సీతాకోకచిలుక | 21 |
| 13. | అదొక్కటే | 23 |
| 14. | సమ్మె | 24 |
| 15. | పడగనీడలు | 26 |
| 16. | అందాలపోటీ | 28 |
| 17. | పిచ్చితల్లి | 30 |
| 18. | ఎదెళ్ళిపోయింది | 32 |
| 19. | అంటే | 34 |
| 20. | పాతర | 36 |
| 21. | గుండెరసి | 38 |
| 22. | బాండేజ్ | 40 |
| 23. | ప్రపంచపు బిడ్డలు | 41 |
| 24. | మొగుడు + మగాడు | 43 |
| 25. | ఘనత | 44 |
| 26. | శాపం | 45 |
| 27. | అవినవ్వావు | 47 |
| 28. | అతనూ .... నేనూ | 49 |

| | | |
|---|---|---|
| 29. | మళ్ళీ పట్టాలనిచూస్తే | 51 |
| 30. | జాగ్రత్త | 52 |
| 31. | కూటికోసం | 53 |
| 32. | గడ్డి గులాబీలు | 55 |
| 33. | గర్తుందిరా కన్నా! | 57 |
| 34. | అమ్మను చూడు | 58 |
| 35. | బ్రతుకుచర్య | 60 |
| 36. | ఉంది | 62 |
| 37. | ఎదురీత | 63 |
| 38. | చైతన్యం | 64 |
| 39. | తప్పిపోయినబిడ్డ | 66 |
| 40. | తెల్లకాగితంకాదు | 68 |
| 41. | హక్కు | 69 |
| 42. | దరిద్రుని శవయాత్ర | 71 |
| 43. | కోరిక | 73 |
| 44. | ఇప్పటికైనా | 74 |
| 45. | చిన్నిపాప | 76 |
| 46. | జైలుపక్షులు | 78 |
| 47. | మరలిరాని పయనం | 80 |
| 48. | విహంగం | 82 |
| 49. | కాలపు కసి | 84 |
| 50. | చీకటి కథ | 87 |
| 51. | అనుబంధాలు | 89 |
| 52. | స్థిమితం | 90 |
| 53. | మీరెప్పుడైనా గమనించారా | 91 |
| 54. | ఒక్కసారైనా | 92 |
| 55. | కావిడి కుండలు | 93 |
| 56. | పోరాటం | 95 |
| 57. | జాడలు | 97 |
| 58. | అంటువ్యాధి | 98 |

| | | |
|---|---|---|
| 59. | చిరునవ్వు | 100 |
| 60. | మనసా | 102 |
| 61. | జీవితం | 103 |
| 62. | వైకుంఠపాళి | 104 |
| 63. | మరుపు | 106 |
| 64. | నాగరికత | 107 |
| 65. | జాగ్రత్త | 109 |
| 66. | ఓటమి | 110 |
| 67. | వలస | 111 |
| 68. | ప్రశ్న | 113 |
| 69. | మౌనమైన మనసా | 114 |
| 70. | వ్యత్యాసం | 115 |
| 71. | వెలుతురు | 116 |
| 72. | తపన | 117 |
| 73. | అబార్షన్ | 118 |
| 74. | హృదయ తరంగం | 120 |
| 75. | స్త్రీ | 122 |
| 76. | నాతరం | 124 |
| 77. | అమ్మమనసు | 125 |
| 78. | ఈరోజు నవ్వింది | 127 |
| 79. | స్పర్శించాల్సి ఉంది | 129 |
| 80. | నేటిమహిళ | 131 |
| 81. | ఆలోచన | 133 |
| 82. | ఘర్షణ | 135 |
| 83. | కూపం | 137 |
| 84. | కేంద్రం | 138 |
| 85. | ఎదురుతిరిగిన మనిషి | 140 |
| 86. | ఆడపిల్ల | 142 |
| 87. | యానం | 143 |

# సాహితీ లోకం

జీవితం కౌగిట్లో
స్వాంతన పొందిందేమీలేదు
కాలం గుండెల్లో
సేద దీరిందెప్పుడూలేదు
కాలం జీవితం కలిసి
బాధ్యతల చక్రాలబండిపై కూర్చోబెట్టి
అంతం కేసి పంతం పట్టి
తోస్తున్నాయి !

జీవితపు బిగిని సడలించి
కాలం వేగాన్ని సవరించి
ముకుళించిన మనసుని
వైశాల్యంచేసి
కలం అంచులనుండి జారి
సాహితీ లోకంలోకి
ప్రధమపాదం ప్రవేశపెట్టా !

తొలి అడుగులోనే
అద్వితీయమైన ఆనందం
తోటివారి జీవితాలను
స్పందించి చిత్రించడంలో
అమోఘమైన ఆప్యాయం
నన్ను నేను నిలవరించుకోలేని
అదృష్టవంతమైన కవనం !

ఇదే నాకు వరంగా
ఇదే నన్ను సేదదీర్చగా
నిరాటంకంగా జీవితాంతం
విసుగులేని ప్రయాణం చేస్తా
సాహితీ లోకపు స్వర్గాలు చూస్తా !

# ధిక్కారం

మాతృవంశ
సంప్రదాయం కూలదోసి
సమాజంలో ఆధిక్యత
పరిణామ క్రమంలో
నీకు నీవు ఆపాదించుకుని
వంశ కుల గోత్రాలను
అదుపులో పెట్టుకుని
అధికారం చేస్తున్న పురుషుడా,
ఎక్కడిది నీనాన్నతనం ?
ఎక్కడివి నీకులం గోత్రం వంశం ?

ఊపిరి తెలియక ముందే
అమ్మ ఉమ్మనీరులో డోలనం
అమ్మ గర్భకోశపు వెచ్చదనం
అమ్మ ఊపిరిలోని వాయుగుణం
పుట్టక ముందే బిడ్డకు
అమ్మను పరిచయం చేస్తాయి !
తనను కనక ముందే
అమ్మను అమ్మగా గుర్తుపడుతుంది !

ఎందుకంటే ?
కణాలు కూర్చేది
కండరాలు పేర్చేది
నరాలను కలిపేది
రక్తం నింపేది
జన్మనిచ్చేది అమ్మ !

శ్రీలత

బిడ్డ మొదటి పెదాల కలయికలో
బిడ్డ కనుపాపల మొదటి కదలికలో
మల మూత్ర విసర్జనకు
బిడ్డ అణువణువూ క్షణక్షణమూ అమ్మ !

అటువంటి అమ్మ
ఎక్కడో దూరాన నిలచిన నిన్ను
''అడుగో నాన్న'' అని పరిచయం చేసాకే
నువ్వు బిడ్డకు తండ్రివవుతావు !

అప్పటి వరకూ
ఎక్కడిది నీ అలికిడి ?
ఎక్కడిది నీ వినికిడి ?
ఎక్కడిది నీ ఆచూకీ ?
ఎక్కడిది నీ గుర్తింపు ?

ఏ చరిత్ర చెప్పని నిజమిది
ఏ శాస్త్రానికీ అందని సాక్ష్యమిది
ఏ తీర్పుకూ చెందని సత్యమిది
అమ్మ చూపుడు వేలు కొసల్లోంచి
అమ్మ కొనన్నాలిక చివరల్లోంచి జారి
నాన్నవై, బిడ్డ జీవితాన్ని
నీవంశానికి కట్టి పడేస్తున్నావు !

పుట్టుక ముందు నుండీ
బిడ్డ అమ్మ వంశం
అమ్మ కులం
అమ్మ గోత్రం
అందుకే
కుల గోత్రాలు, వంశమర్యాదలూ మావంటూ
విర్రవీగే పురుషాధిక్య సమాజాన్ని
ధిక్కరిస్తున్నాం !

ధిక్కారం

మానవి పై మానవి బిడ్డపై
పురుషుడి కున్న అధికారాన్ని
తృణీకస్తున్నాం!
జీవితం మాది
సంతానం మాది
ఈ సృష్టిలో ప్రతిదీ మాదే అని
పిడికిలి బిగించి నినదిస్తున్నాం!
అసలు, ఓ పురుషుడా నీవు కూడా
మేము కన్న మాకు చెందిన
ఒక ప్రాణివని ప్రతిపాదిస్తున్నాం!

హైకోర్టు న్యాయమూర్తి మోతీలాల్ నాయక్
ఫిబ్రవరి 2–1996 న బిడ్డ తండ్రి కులానికి
మాత్రమే చెందుతుందని, తల్లి కులానికి
గుర్తింపు లేదని తీర్పునిచ్చారు.

# నాన్నా నిన్ను విడిచి ....

కడుపులో బిడ్డ
పేగు కత్తిరంచుకు పోతునట్టు
గండె నరాల్ని గుచ్చిలాగినట్టు
పసిపాపనై గుప్పెట్లోని
బెలూన్ల గుత్తిని
ఆకాశంలో పోగొట్టుకున్నట్టు
ఆడుకుంటున్న అమ్మా నాన్న బొమ్మల్ని
ఎవరో లాక్కుపోయినట్టు
ఎదలో సుడులు తిరిగే
దుఃఖపు సంద్రానికి
కనురెప్పలగట్లు గండిపడి
చెక్కిలి మైదానం
మునిగి పోతుంటే
నీ జ్ఞాపకాల కాగితపు పడవలు
తరలి పోకుండా కాపాడుకుంటు
నాన్నా ! నీకు వీడ్కోలిచ్చి
నా ప్రమేయం లేకుండానే
నా సంసారంలోకి
కొట్టుకు పోతున్న ప్రతిసారీ
వలస సాగుతున్న మనసుకు
ఒళ్ళు తెలీని వేదన,
వయసు కత్తిరించి
పట్టులంగా జాకెట్టు వేసుకుని
జడ కుచ్చుల లయతో
నీ ప్రాంగణంలో మళ్ళీ
గెంతులాడె లేడిపిల్లనవ్వాలని !
బంధాలను దూరం చేసి
ఆత్మీయులను వదిలివేసి

వంశం గోత్రం మార్చేసి
కొత్త మనుషులతో
కొత్త మనుసుతో
కొంగుముడి వేసేసి
ఆజన్మాంతం తిరిగిరాని
వలస పంపే సంస్కృతికి
ఒక్కసారి తిలోదకాలివ్వాలని !

# జీవన శ్మశానం

అయ్యో అమ్మాయీ!
జీవితాన్ని మరీ అలా తవ్వకు
ఏ పెన్నిధులో ఉన్నాయని భ్రమపడకు
అది ఆశయాలు
ఆలోచనలు, ఆవేదనలు
పాతి బెట్టబడిన
శ్మశాన వాటిక!
తవ్విన కొద్దీ నీకు దొరికేవి
అసమర్థతల
అకృతికోల్పోయిన అస్థికలే
బయట పడిన కొద్దీ
అస్తిపంజరాల అవశేషాలే
పుర్రెలకు మాంసం అతికించి
ఎముకలకు చర్మం తొడిగేసి
ఏదో బ్రతుకుతున్న వాళ్ళం
మరీ అంతగా ఆలోచిస్తే
ఆవిరయి పోయిన మెదడు
మళ్ళీ వచ్చి కుదురుగా
కూచుంటుందను కుంటున్నా వేమో
కాదు కాదు
నిన్ను రెచ్చగొట్టి
పూడ్చిన వన్నీ వెలికి తీసి
ప్రాణం పొయ్యమంటుంది!
శ్మశానాన్ని పూలవనం
చెయ్యమని వెంటబడుతుంది!

ఎందు కొచ్చిన గొడవ
వంటింటి పోపు ఘుమఘుమలో
స్వర్గాలు వెతుక్కోక
శ్రావణ కార్తీక పూజల్తో
పేరంటాల ఆర్భాటంలో
ప్రాతివ్రత్యం ప్రదర్శించక
పట్టుచీరలు నగల్తో
నిన్ను నీవు పూడ్చేసుకోక!

# మాటలా ....

అవి మాటలా కావు
మాటలైతే వారధులు కడతాయి
పూల జల్లులై పరిమళిస్తాయి
సాంత్వనై సేద దీర్చుతాయి
శాంతమై ఊరటనిస్తాయి
జోకులు చెప్పి పకపకలాడిస్తాయి !

మనసుల్లో దిగి రక్తం చిమ్మేవి
గుండెను తటిల్లున పగులగొట్టేవి
మనిషి మనిషికీ మధ్య
బంధాలను తెగ్గొసేవి
మాటలా కావవి ఈటెలు !

హృదయాల్లో దిగబడి నరాలు తెంపేవి
మెదడు ఛిద్రం చేసి
ఉన్మాదిగా రెచ్చగొట్టేవి
నిర్లిప్తతను నింపి వెళ్ళేవి
మాటలా కానే కావు పిడిబాకులు !

చెప్పలేం అవి ఎప్పుడు ఏం చేస్తాయో
ఉద్రేకం రేపి విచ్చు కత్తుల్ని
పదును పెట్టవచ్చు
గుండెను చంపి నిశ్శబ్దం చేయనూ వచ్చు
మెదడును అణువణువులుగా కోయనూవచ్చు !

మాటలా కావవి వాటమెరిగిన
రాటుదేలిన బాణపు మొనలవి
జుగుప్సతో ఛీత్కరించినా

అసహ్యంతో వాంతి చేసుకున్నా ఆగవవి
దుర్వాసనతో మురిగిపోయిన మాటలవి.
ఏ మగాడికి ఏమగాడిపై
కోపమొచ్చినా కసిరేగినా
అమాయకపు అమ్మనూ, అక్కనూ, ఆలినీ
మాటలతోనే చెరిచే
మృగాల రక్కసిమనసుల
మదపు అరుపులవి !
లెక్కచేయకు లెక్క చేయకు
శవాల నవ్వులవి !
శాడిజపు జాడలవి !

# నిన్నొక్కసారి ....

స్వఛమైన స్ఫటికం లాంటి యవ్వనంలో
అలవోకగ లోకం కేసి చూస్తూ
వింతలకు విస్తుపోతూ
వివేకం విప్పారని వయసుతో
అందమైన పూలకొమ్మకు
అరవిరిసిన గులాబీ!
ప్రేమనే రంగులలోకం
అసలు నిజాన్ని మరిపించి
లేచి రమ్మని ఆహ్వానించిందేమో,
నువ్వు తోడుంటావని
అమ్మనూ, నాన్ననూ
శాపగ్రస్తులను చేసి
అర్థాంతరంగా వదిలేసి వస్తే,
పూటకో పురుషుడికింద నలిగె
కుళ్ళులోకానికి
వంపు వంపుకూ రేటుకట్టి
వెలవేసి అమ్మివేసి
కలల రంగులు తుడిచేసి
త్రిశంకు స్వర్గంలో
తల కిందులుగా వేలాడదీసి,
అడ్రసులేకుండా పోతే,
ఒక్కో మగాడి చేతిలో
కాలిన సిగరెట్టై
తాగివిడిచిన ఎంగిలి గ్లాసై
బ్రతుకంతా గుమ్మానికి ఆనుకుని

శ్రీలత

## ధిక్కారం

ఎవడొస్తాడా మాంసాన్ని కొనడానికి
ఆపూట గుండెలో కత్తి దింపి
ఆకలి అరచేతికి
నలిగిన నోటందించి
కారే కన్నీళ్ళు తడిమి
చెమటలు పట్టించానని తృప్తి పడే
చేతుల్లో నలుగుతూ
సుఖరోగాల జల్లెడై
శవంపై చల్లే తంగేడిపువ్వై
గడియకోమగాడికి
శరీరం అప్పచెప్పినా
భార్యకాలేక
నలిగిన కాలిబాటై
ఏ గడ్డి మొలకను
ప్రసవించలేక
వెనుకకు తిరిగే
దారులు మూసుకోగా
నిర్లిప్త ముఖానికి
సంతోషపు పౌడరు అద్ది
శోకపు పెదాలకు
అసహజపు రంగులద్ది
వ్యాపార అంగాలకు
నైలాన్ చీరకట్టి
పేలవమయిన నవ్వుతో
ప్రతివాడి మురుగుకూ
డ్రైనేజ్ కాలువై
జీవిస్తూ జీవిస్తూ
ఎక్కడో చెత్తకుండీ పక్కన
ఏనాడో శవాన్నయ్యే ముందు
నిన్నొక్కసారి చంపాలని!

# నువ్వు పోతే

అప్పుడెప్పుడో
పెద్దదానివయ్యావంటూ
తెల్లవారు ఝామున
అమ్మ పుసుపు రాసింది !
ఆడతనం వచ్చిందంటూ
కుంకుమ పెట్టింది !
అలంకారం నీకంటు
పారాణి దిద్దింది !
పరిమళించు నీవంటు
పూలు తురుమింది !
కిల కిల లాడమంటూ
గల గల గాజులు వేసింది
నువ్వేస్తూ ఇవేవీ తేలేదు
ఇవి యిచ్చిన అమ్మ
పోయినపుడివి పోలేదు
మరి నీవు పోయినపుడు
ఎందుకు పోతున్నాయి ?

# చేయగలవాడె

ప్రేమించలేని వాడు
ప్రేమించ బడలేడు
మమత లేని వాడు
మనసు గెలవలేడు
త్యాగి కాని వాడు
ఏవీ ఆశించకూడదు
నవ్వలేని వాడు
నవ్వించనూ లేడు
చలించని వాడు
చలనం కలిగించలేడు
జీవించని వాడు
జీవింపచేయ లేడు
దేన్నైనా చేయగలవాడె
చేయించగలడు

# కలల బదులు

కలలు
అలలు అలలుగా
ప్రతిరేయి ముసురుకునే
అవసరాల వలలు !
కుడుపు నిండాతిని
కంటినిండా నిద్రపోదామంటే
ఒక్క రాత్రయినా రాకుండా వదలవు !
నిదురలో నయినా
నిజం మరచిపోదామంటే
ఊహు ! కూడదంటూ
ముసురుకునే కలలు !
పిల్లవాడి స్కూలు ఫీజు
పిల్లదాని యూనిఫారం
అడ్వాన్స్ ఫీజులు లెక్కలు
పుస్తకాలు షూస్
వంటింట్లో నిండుకున్న సరుకులు
ఏనెలయినా ఒకటే తంతు
పచారీ అంగట్లో బాకీ
బట్టల దుకాణంలో అరువు
కుదువ పెట్టిన ఇత్తడి బిందె
నానబెట్టిన అప్పడాలపిండి
చదుకున్నానయినా కాదు
ఏ టీచరుద్యోగానికయినా వెళ్ళను
వత్తి వత్తి ఒళ్ళే అప్పడం అయింది

ఆయనెంచక్కా నిద్దరోతున్నాడు
తెల్లారుతుందని భయం !
రాత్రిని మింగేస్తున్న వెలుతురంటేబిడియం
అవసరాలు చుట్టుముట్టేది తెల్లారితేనేకదా
కలలు రంగురంగుల కలలు
వంటిమీద షిఫాన్ చీర
తెల్లటిమారుతీ కారు
చిన్న బొచ్చు కుక్క
బుగ్గలు సొట్టలు పడుతూ పిల్లలిద్దరూ
సూటులో శ్రీవారు,
ఇలా కలయినా కందామంటే
నిజాన్ని విడిచి రావు !
ఆదాయం బెత్తెడని
అవసరాలు ఆగవు
వర్షానికి కూరిసే పెంకుటిల్లు
బాకీ తీర్చమని తిరిగే
అప్పుల వాళ్ళు
నిజాన్ని మరపించకుంటే
ఇక కలలెందుకు
మేలు కునుంటే పోలా
అప్పడాలు వత్తుతూ
అవయినా పనికోస్తాయేమో
కలల బదులు !

# చరిత్ర కెక్కని బ్రతుకులు

సీతలా ఎన్నోసార్లు
అనుమానించి అగ్గిలోతోసినా
ద్రౌపదిలా కట్టుబట్టలను
ఎన్నిసార్లు విప్పివడేసినా
చంద్రమతిలా ఎన్నోసార్లు
బేరమాడి అమ్మివేసినా
అహల్యలా ఎన్నోసార్లు
మాటు వేసి అనుభవించినా
ఎన్నో యుగాలుగా
ఎన్నో జీవితాలు
కాలంగానుగ కింద నలిగినా
రక్త తైలం చిమ్మినా
అణిగివున్న అహం రెచ్చగొట్టబడి
శక్తి పేట్రేగి
ప్రణవమై మ్రోగలేదు కనుక
ఏ చరిత్రకూ ఎక్కని బ్రతుకులవి
ఏ పాఠకుడూ పఠించని
చీకటి మూలల్లో
శబ్దం రానీకుండా
తమ చేతుల్తోనే
గొంతు పిసుక్కున్న జీవాలవి
వారి నవ్వుల వెనుక
గుండె గాయాలను
టార్చిలైటు వేసి వెతికినా

ఏ కలమూ పట్టలేదు
వారి కళ్ళలోని
అగాధాల రహస్యాలు
ఏమైక్రోస్కోపు పెట్టి చూసినా
ఏ హృదయానికీ దొరుకవు
వాళ్ళ బ్రతుకుల్లోని నిర్జీవతను
ఏ కన్నులూ దర్శింపలేవు
ఎవరి దృష్టికీ ఏమాత్రం
అందనీయక
నవ్వుల వెనుక తమను తాము
పూడ్చి పెట్టి
యూగాలు గడిపిన జన్మలవి
చరిత్ర కెక్కన జీవాలవి
ధరిత్రి నిండా వ్యాపించి ఉన్నవి !

# ఎందుకంటే

మీ అంతట మీరె
నన్ని అబలత్వపు
సుడిగుండాల్లోకి తోసేసి
ఆర్తనాదం ఎందుకంటే
ఆత్మను రక్షించుకోవడానికి

...............................

మీ అంతట మీరె
నన్నవమానాల పాలు చేసి
నారక్తాన్ని మరగించి
ఆవేదన ఎందుకంటే
నన్ను నేను ఓదార్చుకోవడానికి

.................................

మీ అంతట మీరె
నన్ను నిరాశ లోయల్లోకి
నిర్దాక్షిణ్యంగా నెట్టేసి
ఆక్రోశం ఎందుకంటే
నన్ను నేను తట్టిలేపడానికి

..............................

మీ అంతట మీరె
నన్ను నిస్సహాయతను చేసి
చేతకాని తనాన్ని ప్రేరేపించి
ఆక్రందన ఎందుకంటే
నన్ను నేను సమర్థించుకోవడానికి

..................................

మీ అంతట మీరె
యుగయుగాలుగా
నాశక్తిని అణచివేసి
తరతరాలుగా
తలరాతని సమర్థించి
అశక్తతలో నన్ను పూడ్చి
ఉక్రోషం ఎందుకంటే
నన్నునేను దర్శించు కోవడానికి

..................................

మీ అంతట మీరే
గౌరవిస్తున్నట్లుగానే ఉండి
ఉన్నట్టుండి ఒకరోజు
నా హృదయాన్ని, ఆశయాన్ని
నిమజ్జనం చేసేసి
ఆవేశం ఎందుకంటే
నన్నునేను నిర్మించు కోవడానికి !

# సీతాకోక చిలుక

నువ్వు ప్రాణం పొయ్యావు
శరీరాన్నివ్వవు
జన్మనివ్వవు
ఒక్క తాళిబొట్టుతో
జీవితం సొం,తం చేసుకొని
ఆధిపత్యం సంపాదించుకుంటావు
హక్కులు ఆపాదించుకుంటావు

నువ్వు నవ్వమంటే నవ్వి
ఏడ్వమంటే ఏడ్చి
నీకోసం మాత్రమే బ్రతికే
పరిధులు ఏర్పరచి
కదలలేని శిలాప్రతిమను చేస్తావు

నువ్వుతప్ప ఏ జీవితపు
సుఖాలను పొందకూడదంటావు
నువ్వు కనమంటే కని
తినమంటే తినే
బ్రతుకు రిమోట్‌ని
నీ వేళ్ళతో ఆడిస్తావు
దానికి ప్రేమ పాతివ్రత్యం
పేర్లు పెడతావు

సంఘ మర్యాదలంటూ
కట్టి పడేస్తావు
రెక్కలు పట్టి
నీగుప్పెట్లోంచి ఎగరలేని

సీతాకోక చిలుకను చేసి
ఆనందిస్తావు
అంతా నీ అధీనం అను కుంటావు
మూల్గుతున్న మనసెపుడో లేస్తుంది
నీ గుప్పెట్లోంచి ఎగిరిపోవాలని
ఎదురెదురు చూస్తుంది
అందుకు బలం పెంచుకుంటూనే ఉంటుంది.
తిరిగబడి కసి తీర్చుకునే తీరుతుంది.

# అదొక్కటే....

పెదాల తడుపుతో ఆరంభమై
పేగులలో
యాసిడ్ నింపినట్టు
మంటలా మండి
మోకాళ్ళతో కడుపును
తన్నిపెట్టి పడుకున్నా
ఆగక జరజరా పాకి
నరనరాల్లో నిండిపోయి
మంట బాధగా మారి
కళ్ళు గిరగిరా తిప్పి
ఏదో ఒకటి నాలో నింపమని
జీర్ణకోశం తొందర పెడితే
అరచేతిలో పిడికెడు మెతుకులకై
దొంగతనం చేసే వరకు
అరచేయి సాచి అడుక్కునే వరకు
శీలాన్ని అమ్ముకుని చెడిపోయేంతవరకు
కన్న బిడ్డల్ని చంపి తానూ చచ్చేవరకు
ఒకప్రాణి చేత మరో ప్రాణిని
నిర్దాక్షిణ్యంగా హత్య చేయిస్తూ
ఆవురావురు మని తన బ్రతుకుని తానే
ముద్దలుగా మింగేంత వరకూ
నిలువునా హింస పెట్టేది
మరణం వరకూ వెంటాడేది
అదొక్కటే ఆకలొక్కటే!

# సమ్మె

ఒకే పుస్తకంలోవి
రెండు కాగితాలు
ఒకే యింటివి
రెండు జీవితాలు

మహారచయిత
కలంసిరాపడి
మహ్గ్రంథంలో భాగమై
వెలిగిందొకటి

చిత్తు కాగితమై
చెత్తబుట్టచేరి
కాళ్ళకింద నలిగిందొకటి

సమర్థుని సాన్నిహిత్యం
రాణివాసరం
అసమర్థుని సాన్నిహిత్యం
బానిసత్వం!

తరం మారింది
తలరాతను మార్చింది

చిత్తుకాగితాలు
చెత్త జీవితాలు
సమ్మె చేస్తున్నాయి
చెత్తంతా మామీద
రాయొద్దంటున్నాయి

చింపి మూలకు
విసిరే మొద్దంటున్నాయి

కాలాన్నీ, భావాన్ని
పదాన్ని, కాగితాన్ని
ఇవన్నీ కాక జీవితాన్ని
చెత్త బుట్టలో
గడనివ్వకంటున్నాయి
కాళ్ళకింద
నలగ నివ్వమంటున్నాయి.

# పడగనీడలు

జాడలా
అవును అవిజాడలే
తరతరాలుగ సాగిన జాడలు
పసుపుబట్టల్తో పూలదండల్తో
చిటికిన వేలు పట్టిసాగిన జాడలు
కొందరి కవి
పూలవనాల వైపు
అడుగులు సాగిన జాడలు
స్వర్గపుటంచులు దర్శింపచేసే జాడలు
జీవన మధురిమలు చిలికి
మమకారం పంచే జాడలు
తీయని బాధ్యతలతో
తేనియలు మోసే జాడలు
నీలాంటి వారికి కూడా అవి జాడలే
కాని అవి నీడలవైపు జరిగిన జాడలు
నీడలంటే నీడలు కావు పడగనీడలు
బలిపశువులా అలంకరించి
కన్నవాళ్ళే అశీర్వాదించి
సాగనంపే జాడలు
మరలి రాకుండా
అడ్డంగా గోడలు నిర్మించి
నిన్నా నీడలవైపు పంపే జాడలు
నువ్వా జాడలవెంట పోవసిందే
ఆనీడల కింద క్షణక్షణం ప్రాణభయంతో

బ్రతుకుతూ భరింపవలసిందే
అవి రక్షస్తాయని అందరూ చెబుతారు
ఎంత తొందరగా భక్షిద్దామా అని
అవి ఎదురు చూస్తుంటాయి
గోడలు దాటి ఎలాగూ రాలేవు
జాడలయినా మార్చి చూడు
మరికొందరు నీఅడుగుల ననుకరిస్తారేమో !
(పెళ్ళి పేరుతో మోసపోయిన అమెరికాలో ఇందిర కోసం)

# అందాల పోటీ

అమ్మాయిల్లారా రండి
అందాల పోటీ ఉంది
కొలతల్లో కుదించిన
వయారాలు ఒలికించండి !

అమ్మ అక్క చెల్లి భార్య
అనేటి తేడా ఏమిటి
ప్రపంచ అందాల పేరుతో
ప్రదర్శనకు సిద్ధం కండి !

పచార్ల అంగడిలో
ఏఖరీదయిన మాలుకు
మీరసలు తీసిపోరండి
రకరకాల భంగిమలో
స్త్రీ మాంస ప్రదర్శనం చేయండి !

సిగ్గు బిడియాలకు
మార్కులసలు రావండి
పేలవమయిన నవ్వుంటే
పేలికలయిన డ్రస్సుంటే
మేకప్పయిన ఫేసుంటే చాలండి !

అందానికి గిరిగీసి
ఫైజిలిచ్చే మూర్ఖులున్నారండి !

చూసే కనులకు మనసున్నా
మురిసే మనసుకు కనులున్నా

సర్వం సౌందర్యమయమని
వర్ణించే దృష్టిలేక
అంధకారంలో తడిమి
అతివనొక్కదాన్ని చూపి
సుందర సృష్టినంతా
కురూపిని చేస్తున్నారండి
కుత్సితమవుతున్నారండి !

తప్పు తప్పు సిగ్గు సిగ్గు
రద్దు రద్దు, వద్దు వద్దు అని
ఆపచేతకాని ఆడవాళ్ళంతా
అందాలను పాలిష్ చేస్తున్నారండి
మరోదురాచారానికి
మాలీష్ చేస్తున్నారండి !

# పిచ్చితల్లి

మాసినచీర, రేగినజుట్టు
చిరిగిన జాకెట్టు
జారినపైకట్టు !
బొట్టులేదు సరియైనకట్టులేదు
తాళిబొట్టులేదు
చేతికి గాజులూలేవు
ముత్తయిదువో
వితంతువో తేడాతెలీదు

తనదంటూ ఏవీలేని
బిచ్చమెత్తుకునే పిచ్చిదానికి
కన్నెరికం చిరిగిన గుర్తుగా
జోలలో నల్లగా పీలగా
ఎండిపోయిన పెదాల్తో
పాలులేని గుండెల్ని
పదేపదే తడుముతుండే
బక్కచిక్కిన బిడ్డ

తండ్రెవరో తెలీదు
ఏచీకట్లోనో
ఏ బస్టాండు మూలల్లోనో
తన గుండెల్ని తడిమి
తన గర్భంలోకి జార్చిన చినుకులు
ఎవరి తాలూకో తెలీదు

కడుపు పెరిగి
నొప్పుల్తో పొర్లుతుంటే

దాపుకు చేరి ప్రసవం చేస్తే
పుట్టిన బిడ్డ అది !

అది ఆడయినా మగయినా ఒక్కటే
దానికి తల్లయినా తండ్రయినా పిచ్చిదే
యింటిపేరులేదు
దానికి ఒంటిపేరులేదు
ఎక్కడో అడుక్కుని
ఏమూలో పడికునే
పిచ్చిదానికి ఇదో జంఘూటం !

అయినా బిడ్డను వదల్దు
ఎవరో నాటిన బీజానికి
తాను ధరిత్రి అవుతుంది !
ఆబిడ్డకు తండ్రి అవసరంలేదు
కులగోత్రాలు అక్కర్లేదు
పరువు మర్యాదలసలు తెలీవు
నీతి నియమాలు లేనేలేవు
తల్లి జోలెలోనే పెరిగి పెద్దయి
మరో బిచ్చగత్తె అవుతుంది
మళ్ళీతల్లి అవుతుంది
చరిత్ర పునరావృత్తమవుతుంది !

# ఎదెల్లి పోయింది

ఎపుడో సాయంత్రం వేళ
ఏదో ఏకాంతంలో
అలా షికారుగా బయటకెళ్ళా
ఎన్నాల్టి స్నేహమో ఎదురుపడి
ఊరుకోకుండా ''ఎలాగున్నావు'' అంది !
అంతే ''ఎద'' ఒకటే గోల

వానాకాలంలో
ఏటి ఒడ్డున
గతుకుల రోడ్డు మీద
గూడులేని కుంటెద్దుల
డొక్కుబండీ సవారాలా
తడవకుండ, జారకుండా
గతక్కుండ కూలబడకుండా
కుంటి కాలెగరేసుకుంటూ
కుంటల్నెగిరి దాటుకుంటూ
ప్రయాణం చేస్తున్నా !

ఇదో సర్కసులాగుంది జీవితం
ప్రాక్టీసులేని జిమ్నాసిటక్కులెన్నిచేయాలో !
జారిబోర్లాపడినా
కిక్కురుమనకుండా లేచి
మళ్ళీ ఏమెరుగ నట్లు
మొదలెట్టాలి !

ఛీ ! పాడురొష్టు
నవ్వు రాకపోయినా

పెదాల్ని సాగతీస్తూ
మాట రాగపోయినా
పదాల్ని కూడదీస్తూ
పదేపదేకాని ఖుషీల్ని
ప్రపంచానికి చూపిస్తూ
జనాన్ని ఈసుపెట్టి
సుఖాన్ని పొందాననుకుంటూ,

అబద్ధపు నాటకాల
అంతేలేని బూటకాల
తోలు కప్పిన బొమ్మలాట!
''నే బ్రతకలేను బాబూ
ఈ బాగోతపు సమాజంలో
నేనే అడవిలోకో వెళ్ళిపోతా
కంటి కందింది చూస్తూ
కందమూలాలు తింటు
కూనిరాగాలు తీస్తూ
పూలరెమ్మల్లో తేనెచుక్కలు పీలుస్తూ,

చల్లగా చల్లగాలై
వర్షించే వెన్నెల్లో తడుస్తూ
నాయిష్టం వచ్చినట్లు బ్రతికేస్తానని''
''అలా ఒప్పేసుకుంటె ఎలా'' అని
''చాలా బాగున్నానోయ్'' అని
నన్ను నేను తడిమిచూసుకుంటే
నాలో ఏదో ఖాళీచేసి
వెళ్ళిపోయినట్లనిపించింది.
నాచుట్టూ వునాన్నవాళ్ళను
తేరిపేర చూసా!
అందర్లోనూ ఏదో ఖాళీ
ఏదేమో మరి!

# అంటే ....

సుఖమా ? అంటే ....
మురుకు వాడలో
సుత్తుగిన్నెలో
చద్దన్నం మీద
ఈగలు ముసురుతుంటే
కారం చల్లుకుని
ఉల్లిపాయ సంజుకుని
నాలుగు ముద్దలు మింగి
చింకి చాపమీద
చలికి దుప్పటిలేక
ముడుచుకునే మాకు
నిద్రపట్టడం !
సంతోషమా ? అంటే ....
గుక్కెడు నీళ్ళకై
బిందెలు పట్టుకుని
మురుగునీటి కాల్వమధ్య
మున్సిపల్ కొళాయి కింద
చుక్కచుక్కకై
ఎదురు చూస్తూ
రోజంతా గడిపే మాకు
ఒక్క బిందె నీళ్ళు దొరకడం !

సంతృప్తి ? అంటే ....
నిత్యావసరాల కోసం
క్షణక్షణం రాజీపడుతూ
బ్రతుకు చెత్తకుండీలో
అవసరాల చిత్తుఏరుకుని
బ్రతికేమాకు
కడుపు నిండడం !
రోజువారీ అవసరాలు
తీర్చుకో గలగడం !

# పాతర

అదుగో అదేవద్దు
ఆమాటలే పదేపదే అనొద్దు
ఆడది అరిటాకు!
అణిగి మణిగివుంటే
అందరికీ క్షేమం!
ఎదురు తిరిగితే
పవిత్రత లోపం
విచ్చలవిడి తనం!
మనమూ మగవాడిలా మనగలమా?
ఎంత ఎదిగినా ఆడది ఆడదే
బి.ఎ చదివినా
బియ్యం ఏరక తప్పుతుందా?
ఎమ్.ఎ చదివినా
ఎసరు పెట్టక తీరుతుందా?
ఎంత సాధించినా
ఆడపుట్టుక ఆడపుట్టుకే
మగవాడి నీడ పట్టుకే!
అన్యాయం జరిగినా
అసలు నోరు విప్పొద్దు!
అక్రమం జరిగినా
ఆవేశం పడొద్దు!
అని నీలాంటి వాళ్ళు
చెప్పబట్టే అమ్మమ్మా....
ఆడదానికి ఆడదే శత్రువవుతుంది

జుట్టుపట్టి వెనక్కి లాగబడుతుంది!
వెన్నెముక విరిగి వెల్లకిలా పడుతుంది
విచక్షణ కోల్పోయి వివశత్వమవుతుంది!
నీ బోధన లింకచాలు!
నీ ప్రభావం కట్టిపెడితే మేలు!
నువు మాట్లాడకుండా వుంటే పదివేలు!
ముందుకు జరిగే వాళ్ళకు
మునికాళ్ళ బంధాలు వేస్తూ
బుగ్గలు నొక్కుకునే మీకు,
కాలక్షేపం కబుర్లు!
ఒక్కసారి నీకన్నుల కప్పిన
తెరలు చీల్చి చూడు
నీలాంటి సంకెళ్ళను తెంచుకుని
యువతి నడుస్తున్న దారులు చూడు!
నీకసలు ఈర్ష్య ఎక్కువ
నువ్వూ నాలా ఉండలేకపోయానని
నిరంతరం కుళ్ళుజాతర!
మేమెప్పుడో వేసేశాం
నీమాటలకు పాతర!

# గుండెరోసి

కసాయిని నమ్మేగొత్తై
బారెడు జుట్టున్న ఆడదాని పుట్టై
తరతరాలుగా
గాటు పెట్టిన ప్రతి సారీ
గాయం మానకుండానే
అనుభవాలు ఆజ్ఞలు వేసినా
తీయని కబుర్లకు
రేఖలు అమాంతంగా దాటేసే వయసు
తప్పో ఒప్పో చేసేది మాత్రం ఇద్దరు
బలవంతపు బరువు మాత్రం ఒక్కరికే
మాతృత్వం వరం అనాలో
శాపం అనాలో తెలీని పరిస్థితి
పేగుల్లో దూరి
జన్మలను చంపే కత్తులున్నంత వరకు
మనసుల్లో దూరి
గుండెను మాటు పెట్టే మగధీరులకేం కొదువ
ఆడమాంసం రుచి మరిగిన
మృగాల ఆలోచనలో
అందిన ఆడదాని బ్రతుకు,
జేబులు బరువున్న ప్రతి వాడు
తినిపారేయాల్సిన పేపరు ప్లేటు !
తెలిసి తెలిసీ మోసపోతూనే,
మళ్ళీ మాటల గారడీలో
కూరుకు పోతూనే,
మైకం కమ్మిన మనోభావనకు

ప్రేమదోమ అంటూనే,
అవయవాల రాపిడికి
అందమైన పేరుపెట్టి
అంగాల అవసరానికి
రంగుల కలలు రేపి
వదిలేసి పోయినా
గుండె రసి కారుతూనే
మళ్ళీ మోసానికి సిద్ధమౌతూనె ....

# బాండేజ్

గబగబా నడవనీక
కాళ్ళకడ్డం పడుతూ
వళ్ళంతా బాండేజ్ చేసి
శరీరపు గాయాలను దాచిపెడుతూ
బస్సెక్కాలన్నా
సైకిలెక్కాలన్నా
కూడదని వెనక్కిలాగుతూ,
నువ్వొకముసుగు కప్పిన
జన్మవని గుర్తుచేస్తూ,
కాళ్ళెడం కాకుండా
నడకను బద్ధకం చేస్తూ,
కదిలే ప్రపంచంలో
వేగంతో కదలనీక
పాదాల కడ్డం పడుతూ,
టపీమని కింద పడేస్తూ
చిరాకుగా, చీదరగా
గుండెల మీద కప్పుగా
వయసుని దాస్తున్నాననుకుని
తానే జారిపోయి
బయటపెడుతూ,
నిలువునా బంధిస్తూ
చిరాకేసి, విప్పేసి, విసిరేసి
గాలి ఆడేలా శరీరాన్ని ఆరబెట్టుకుని
ఊపిరి పీల్చుకుందామంటే
వదలదీ చీరకట్టు
తరతరాలుగా పట్టినపట్టు !

# ప్రపంచపు బిడ్డలు

నిర్దయ సృష్టికర్త
అమ్మ కొమ్మనుండి
విడదీసిన పూలు
నాన్న నీడనుండి
తుంచి పారేసిన
లేలేత చిగుళ్ళు
కుటుంబమంటే
తెలియని శాపగ్రస్తులు
తనవాళ్ళంటూ ఎవరూలేని
అలవి కాని దిగుళ్ళు
ఒంటరి తనంలో
ఓదార్పుతెలీని మనసులు
ప్రేమ తపనతో
మండే ఆరని కుంపట్లు
ఆప్యాయతకు నోచుకోని
ఆవేదనా పరులు
బ్రతుకు పోరులో
పసి వయసునుండీ
యుద్ధం చేసిన వీరులు
చిన్న పలకరింపుకే
చిప్పిలే లేలేత హృదయాలు
చిన్న చిరునవ్వుకే
ఊరట పొందే మమకారాలు
మరలి చూస్తే చాలు

మురిసి పోయే అనురాగాలు
ప్రపంచమంతా
వీరికి బంధువులు !
సంఘం సేద దీర్చాల్సిన
ప్రేమ పాత్రులు !
సమాజం ఆదరించాల్సిన
ఏకాకి జీవులు !

అనాథలుగా ముద్ర వేయబడిన
అమాయకపు ప్రాణులు !

# మొగుడు + మగాడు

ఎవరో నన్ను చూసాడని
ముసుగు కప్పుకోని తిరగమంటావు!
ఎవరో మగాడు కన్నుకొట్టాడని
నన్ను కళ్ళెత్తి చూడొద్దంటావు!
ఎవరో మగడు కాలుతొక్కాడని
నన్ను బజార్లో నడవొద్దంటావు!
ఎవరో మగాడు పైటలాగాడని
నన్నసలు బయట కెళ్ళొద్దంటావు!
ఎవరో మగాడు నన్ను చూసి నవ్వితే
నీవు నావైపు కోరగా చూస్తావు!
ఎవరో మగాడు వీధిలో ఈలవేస్తే
ఇంటి కొచ్చి నన్ను పీడిస్తావు!
ఒకడి వేధింపుకు ఒకడి సాధింపు
ఎవరో చేసే మదపు చేష్టలకు
నా బ్రతుకు దారులకు కానరాని మూత,
ఈ వేధింపులు, ఈ సాధింపులు
భరించినంత వరకే
ఒక్కసారి ఎదురు తిరిగితే
ఒక్కసారి దేవీ అవతారమెత్తితే
అ తరువాతి పరిణామం
ఎవరికైనా పలాయన సిద్ధాంతమే!

# ఘనత

పార్కులో పెరిగే
క్రోటన్ మొక్కల్లా
ఎదిగీ ఎదగకుండా
గిడస బారి పోయేలా
కత్తిరించి అదుపులో పెట్టడానికి
సంఘానికి ఎన్నిచేతులో
ఎన్నెన్ని కత్తెర్లో
ఎన్నెన్ని కారణాలో
ఎన్నెన్ని నోళ్ళో
చెడిపోయిందని
బరితెగించిందని
పతివ్రత కాదని
ఎన్నెన్ని బిరుదులో !
ఎదగ బోతున్న దాన్ని
ఎన్నిసార్లు కత్తింరిచలేదు కనుక
కత్తిరించిన ప్రతిసారీ
కొత్తచిగుర్లు తొడిగి
మళ్ళీ మళ్ళీ ఎదగాలని !
బ్రతికి నన్నాళ్ళూ
కత్తెర్లను ఎదురించలేక
ఎదగీ ఎదగకుండా ఎదుగుతూ
మొండి బారిన కొమ్మలు
రసికారుస్తూ రోదిస్తుంటే
రెమ్మల్లో పూలు పూయించిన
ఘనత మాది !

# శాపం

కుళ్ళు నింపుకుని
జుగుప్స కారుస్తూ
దారిన పోయే ప్రతి ఒక్కరినీ
అబగా ఆశగా
ఆ మురుగు ప్రవాహానికి
పేగులు వాంతయేలా
అసహ్యం ఒళ్ళంతా నిండేలా
కండరాలు ఊడిపడేలా
తుపుక్కున ఉమ్మాలని పించేలా,
నువ్వు చూసిన బూతు బొమ్మల్తో పోల్చుకుంటూ
అవయవాల్ని అలా
కళ్ళతో తినేస్తావెందుకు ?
నిన్ను సృష్టించి
తొమ్మిది నెలలు చీకట్లో రక్షించి
ప్రపంచంలోకి నెట్టిన
పరమ పావన మందిరపు
ముఖద్వారమదే !
నీకడుపులో పేగుల
ఆక్రందనకు
అమృతం నింపి బ్రతికించిన
క్షీరధారల నిలయాలు అవే !
ఆ బొడ్డు లోతులే
నీ బొడ్డు పేగై
నీకు జీవం పోసింది

అవన్నీ మరచి ఆచూపులేంటిరా ?
నీతాకిడికి వాటికి
శపించే శక్తుంటే
నీకళ్ళూడి పడేలా
అసభ్యాన్ని రంగరించి
నీ కనుగుడ్లు చితక్కొట్టేవి !
నీచేత ''అమ్మా'' అని ఆర్తింపచేసేవి !

# అవి నవ్వవు

అవి నవ్వవు
అవి మెరవవు
ఊర్ధ్వమై నీరింకిన
ఎడారి బయళ్ళు !

నలుగుర్లో నవ్వితే
అనుమానపు చూపులు
నాలుగ్గోడలు మధ్య
వాటుకు ఉరివేస్తాయి !

పొరపాటున మెరిస్తే
అసూయపు దృక్కులు
కత్తుల బోనులోకి తోస్తాయి !

అయినా అవి జీవించే ఉంటాయి
లోకాన్ని చూస్తూనే ఉంటాయి
బ్రతుకుని నడుపుతూనే ఉంటాయి !
భయపడు దారులన్నీ మూసుకుంటూనే ఉంటాయి !

కలలు కనడం మానేసి
కదలికలు మరచి పోయి
సజీవమైన ప్రేతాత్మలను
తలపిస్తుంటాయి !

ఏ భావనా వాటిలో
ప్రతిబింబించదు !

ధిక్కారం

ఏ ఆలోచనా వాటిని కలవరపెట్టదు
అవి ఏమాత్రం స్పందించినా
చెంపలు పేలిపోతాయి !
కడుపులో కాళ్ళు కుమ్ముతాయి !
జుట్టుగుప్పెట్లో చిక్కి
విలవిల లాడుతుంది
బెల్టుతాకిడులు వంటి మీద
రేఖలు గీస్తాయి.
ఎదిరించ లేని గుండె
శరీరం మూలల్లో
ముడుచుకుని దాక్కుంటుంది
అందు కేనేమో
గాజు గోళీల్లా
అవి నవ్వవు
అవి మెరవవు
అవి ఆరిపోయాయి !

# అతనూ నేనూ

అతను !
హుందాగా నువ్వుతూ
నలుగుర్నీ పరామర్శిస్తూ
వీధిలో కులాసాగా నడుస్తాడు !

నేను !
పైట చెంగు చివర్లు పట్టుకుని
నేలకు తలవంచి
సిగ్గుపడుతూ నడుస్తా

అతను !
తన అభిప్రాయాలను
ఘాటుగా వ్యక్తీకరిస్తూ
తనకనుగుణంగా ప్రవర్తిస్తాడు

నేను !
కీచు గొంతుతో మాటల్ని మింగేసి
అభిప్రాయాలు దాచిపెట్టి
ఆలోచనలు ఆపివేస్తా

అతను !
నలుగురూ తనను గుర్తించాలని
నలుగుల్లో పేరు తెచ్చుకోవాలని
సకల ప్రయత్నాలూ చేస్తాడు

నేను !
ఎవరొచ్చినా తలుపు చాటుచేసుకుంటూ
నన్ను నేను అపరిచయం అవుతూ
దాగి ఉండాలని ప్రయత్నిస్తా

అతను !
అధికారం హోదా హుందాతనం ప్రకటిస్తూ
నలుగుర్నీ అజమాయిషీ చేస్తూ
దీటుగా గుండె నిబ్బరంగా బ్రతుకుతాడు

నేను!
పిరికి పిరికిగా భయం భయంగా
నలుగుర్లో సణుగుతూ గొణుగుతూ
చప్పుడు లేకుండా జీవిస్తా !

# మళ్ళీపట్టాలని చూస్తే

ఎగరాలని
హృదయానికి రెక్కలు కట్టుకుంటే
ఎదగాలని
బ్రతుకుకు చిగురులు తొడుక్కుంటే
సమాజం చూపుడు వేళ్ళు
రెక్కల్ని పట్టేస్తే
చూపుల గోళ్ళు
చిగురులు తెంపేస్తే
గుప్పెట్లో గిలగిలలాడుతూ
గుండెరక్తం కారుస్తున్నా
హృదయానికి మళ్లీ
రెక్కలు తొడిగితే
మళ్ళీ చిగురలు సాగితే
ఇవి మునుపటివి కావు
బలమైన, బరువైన, ఇనుపవి పదునైనవి
ఇప్పుడు మళ్ళీ పట్టాలని చూస్తే
చేతులు కోసుకు పోతాయి
చేతలు మూగవోతాయి. !

# జాగ్రత్త !

గతంలో ఏముంది శాస్త్రీ
మళ్ళీమళ్ళీ రాయడానికి
దేవుళ్ళపేరుతో ఎల్లలు గీయడం
పూజల పేరుతో ఉన్మాదం రేపడంతప్ప
లక్ష్మణ రేఖలు
జుట్టుపట్టి బట్టలిప్పడాలు
సరస్వతి చనుకట్టు వర్ణనలు
కుష్టురోగికి బెస్టు పెళ్ళానికి లింకులు
రంభా ఊర్వశి, తిలోత్తమల
కొంగు జార్చడాలు
కొవ్వు చూపడాలు తప్ప,
రాయాలంటే
గాలిలో ఉంది, భూమిలో ఉంది
ఎల్లలు చెరిపిన నీటిలో వుంది
ఎదలను లేపిన భావనలో వుంది
ఎప్పటి కప్పుడు
ముసలి పుచ్చు ముఖానికి
మేకప్పు వేస్తూరాసేరాతల్లో
కొత్త ఏముంది వింత ఏముంది ?
అసలు నిజం ఏముంది ఇజంఏముంది ?
పోపో ! నాలుగ్గోడల మధ్య
నీయిష్టం వచ్చింది రాసుకో
నలుగుర్లోకి వచ్చే ముందు మాత్రం
కాస్త ఆలోచించుకో
సమాజం చేతిలో
కుళ్ళినటమోటాలు
ముర్గిన కోడిగుడ్లు
విరిగిన పాత చెప్పులు
రెడీగా ఉన్నాయి జాగ్రత్త !

# కూటికోసం

చిన్నారి పొన్నారి బాలలు
అరవిరసిన విరిమల్లె రేకులు
అందమైన చిరునవ్వులు
కొమ్మలు పూచిన పున్నాగలు
అందరూ కాదు కొందరు మాత్రమే
మరికొందరు పసికందలు
ఎండి పోయినచ గడ్డిలో
పచ్చదనం కోసం వెతికే
మిడతల దండ్లు
గుక్కెడు నీళ్ళకై
పిడికెడు మెతుకులకై
జన్మలను గాసం పెట్టిన
వెట్టిచాకిరీ వెత్తి వాళ్ళు
కాళ్ళ కింద నలిగే పువ్వులు
ఒంటినిండా బట్టలేక
కంటినిండా నిదురపోక
కరకు బండరాళ్ళను
రాత్రింబవళ్ళు అమ్మి
కడుపు నింపుకునే
దారిద్ర్యపు వారసులు
బంగారు గనుల్లో
బంగారంవంటి జీవితాన్ని
పణంగా పెట్టిన
ఆత్మాహుతి వారసులు
పాలుగారే బుగ్గలు వాడి

లేలేత చేతులు మాడి
పసితనంలోనే ముదిరిపోయిన
కుక్కమూతి పిందెలు !
దాచుకునే అవయవానికి
గోచి ఒక్కటి చాలునని
మిగతా శరీరమంతా
ఎండకు వానకు వదిలేసి
ఎండిన కడుపు నింపే
దారుల వెంబడి
వెతుక్కుంటూ తిరిగే
బ్రతుకు బికారులు
నాలుగు ఝాములూ
గొఱ్ఱెలుకాస్తూ
బఱ్ఱెలు మేపుతూ
కాఫీ కప్పులు కడుగుతూ
పల్లీ బఠాణా అమ్ముతూ
కిళ్ళీ పానులు కడుతూ
సోడా బుడ్లు కొడుతూ
బస్టాండులు ఊడుస్తూ
రైలులో పాటలు పాడుతూ
ఎక్కడంటే అక్కడ
చేసిసాచి దేబిరిస్తూ
కనిపించే పిల్లలంతా
ఈ లోకపు ముద్దు బిడ్డలు
కూటికోసం కాటిలోని
ఎముకలేరి అమ్ముకునే
బాల వేదాంతులు !

# గడ్డిగులాబీలు

పాలుగారె బుగ్గలు
మిసమిసలాడే ఒళ్ళు
నవ్వులు చిందించే కళ్ళు
అందమైన పాపాయి ఆనవాళ్ళు
అమ్మానాన్నలఆశల పొదరిళ్ళు
అమ్మచేతి గోరుముద్దలు తింటూ
నాన్న తీపి కథలు వింటూ
బొచ్చుకుక్క పిల్లతో
హాయిగా కార్లో షికార్లు కొడుతూ
ప్రేమగా పెంచిపెద్దచేసిన
అందమైన పాపాయి
కుండీలో విరిగిన అల్లారు ముద్దుగులాబి

చింకి జుట్టు సవరు కుంటు
గంజిలో మెతుకులు వెతుక్కుంటూ
చిరిగిన గౌనులో
చిల్లులు లెక్కబెడుతూ
చంకన తమ్ముణ్ణెత్తుకుని
వీధివీధి అడుక్కుంటూ
అందం లేని అమ్మాయి
రాగంలేని సన్నాయి !
కాలం బడిలోని కలికి తురాయి !

బ్రతుకు బరువును
సత్తుగిన్నెలో మోసే

చెట్టునుండి రాలిన పొన్నాయి!
కాలికింద గడ్డితల్లికి
పుట్టిన గడ్డి గులాబి!
రెండింటి పుట్టుకా సహజమే
కనుపాపల్లో మెదిలి
కనువిందు చేస్తుందొకటి
కాలికింద నలిగి
చూపుకు కరువౌతుందొకటి!

శ్రీలత

# గుర్తుందిరా కన్నా!

గుర్తుందిరా కన్నా నీకు
అలిగి మారాం చేసినపుడెల్లా
అడిగింది తెచ్చిచ్చిన సంగతి!
అమ్మను నాన్నను నేనే అయి
నిను పెంచిన సంగతి!
వెన్నెట్లో నాచేతి
గోరు ముద్దల రుచి,
అమ్మా అమ్మా అంటూ
కొంగుపట్టుకు తిరిగిన సంగతి!
నీ ప్రాణానికి నా ప్రాణం
ముడుపు కట్టిన సంగతి!
నీ చదువుకు ఇల్లూ వాకిలీ అమ్మి
నీడలేక నిలచిన సంగతి!
ప్రేమించిన అమ్మాయిని
నీ కోసం ఒప్పించిన సంగతి!
నీ పిల్లలకు కాకమ్మ కథలతో
కాలక్షేపం చేసిన సంగతి
గుర్తుందిరా కన్నా నీకు
ఇప్పుడు జవసత్వాలుడిగి
మంచంలోంచి కదల్లేక
పలకరించే వాళ్ళులేక
పల్లెటూర్లో ఒక్కదాన్నీ
నిన్నే పలవరిస్తూ
నీరాకకై చావు మరచి
ఎదురు చూస్తున్న సంగతి!

# అమ్మను చూడు

ఎన్ని సార్లు చూస్తావు ?
ఎంత మందిని చూస్తావు ?
ఎద్దుల సంతలో నీ బేరానికి
ఎన్నిసార్లు కూచుంటావు ?
చూసినపుడెల్ల ఏదో వంక
మనసులేని
నీ శరీరాన్ని కొనడానికి,
ఏ లక్షాధికారి
కూతురి శవంతో
బేరం పెడతావు ?
అక్కడ కూడా
పాడమని నడవమని
వంటొచ్చా అని
ఎన్ని ఆరాలు తీస్తావు ?
నీ పెళ్ళాం ఉద్యోగానికి
ఎంతమందిని
ఇంటర్వ్యూ చేస్తావు ?
బాలేదని ఎంత మందిని
తీసి పారేస్తావు ?
వాళ్ళ మనసుల్లో
మగజాతి పట్ల
ఎంత కసిరేపుతావు
అమ్ముడుపోయే దినువ్వయినపుడు
ఇన్నివివరాలు నీకెందుకు ?
అసలు చూడాల్సింది

నువ్వు నన్నుకాదు
నేను నిన్ను చూడాలి!
చూసే కళ్ళమాటున
కుళ్ళు ఎంతుందో
పలికే పెదవి వెనుక
కుత్సితం ఎంతుందో
బట్టల చాటు శరీరాన్ని
ఏ రోగం పట్టి పీడిస్తుందో
శరీరం చాటు మనసులో
ఏ భోగం దాగి వుందో!

స్త్రీని మనిషిలా చూడలేని గుడ్డితనమా
ముందు మీ అమ్మను చూడు
మరోసారి మీచెల్లెల్ని చూడు
తరువాతే అమ్మాయిల్ని చూడు!

# బ్రతుకు చర్య

అన్ని చెట్లలాగే నేనూ
చిగురించగలను పుష్పించగలను
ఆకులతో దట్టమై గొడుగులు పట్టగలను
ఆకలి వేళ ఫలాల నివ్వగలను
అవసరం వేళ వంటచెరకవ్వగలను
కానీ వేసవి మండు టెండలు కాసి
నన్ను నిలువునా నిర్దయగా దూసేసి
మోడును చేసి వదిలి పెడతుంది
ఆశలన్నీ చంపి వెళుతుంది
అప్పుడు యే పిట్టల పిల్లలు
నాదరిచేరి అల్లరి చేయవు
ఏప్రాణీ సేదదీరడానికి
నా చెంతకు రానేరాదు
ఏ బాటసారి నన్ను
పలకరించి విశ్రమించడు
నేను ఒంటరినై
శాపగ్రస్తవలె మోడుబారతాను
నా జీవితపు వత్సరానికి
వేసవి శాపం
వేసవిని ఎదిరిస్తూ వచ్చే తొలకరి
నన్ను ఒడిచేర్చుకుని
చినుకులు బాష్పాలు కురుస్తాడు
చిగురులు తొడిగిస్తాడు
నేను నిండు గర్భిణినై

ధిక్కారం

శ్రీలత

అందమైన పుష్పాలను ప్రసవిస్తా
తేనె విందులు చేస్తా
తీయ తీయని పండ్లు పంచిపెట్టి
అమ్మనై ఆకలి తీరుస్తా
నా బ్రతుకు సంబరానికి
కోయిలలు మైమరచి గానం చేస్తాయి
చిలుకలు కొమ్మకొమ్మన ఊయలలూగుతాయి
నేను పరవశిస్తూ
అన్ని ప్రాణులకు అందుబాటులో ఉంటా!

# ఉంది ....

నువ్వు అడ్డం వచ్చే
ముళ్ళను ఏరివేస్తూ వుంటే
జన్మంతా నీతో కలసి
అడవుల్లో అరికాళ్ళు చీలినా
అలాగే నడవాలని ఉంది !

నువ్వు నాదాహం తీర్చడానికి
నీరుకోసం వెతుకుతుంటే
బ్రతుకంతా నీతో కలసి
ఎడారిలో కాళ్ళుబొబ్బలెక్కినా
అలాగే నిలవాలని ఉంది

నేను పొగుట్టుకున్న వన్నీ
వెతికి వెతికి నాకందిస్తుంటె
నీ చేతులలో ఇమిడి
నన్ను నేనే పొగొట్టుకుని
వెతికించు కోవాలని ఉంది !

# ఎదురీత

ఆకాశపు చీకటి సంద్రంలో
నక్షత్రపు జ్యోతి కాంతులు
తిమిరంతో పోరాడుతూ
నిరంతరం వెలుగుతూనె వున్నాయి

తమస్సు జడత్వాన్ని
ఎదురించి నిలువలేక
కరిగి కన్నీరు రాసులు పోస్తూంది
గది పరిధిలోని వెర్రికొవ్వొత్తి

జీవించడమె
కాలంతో మనిషి చేసే పోరాటం
జీవన కాఠిన్యం ముందు
పోరాట పటిమ ముఖ్యం
పోరాట పటిమ కంటె
అందులో కరిగి నీరవకుండా
నిలచి ఉండటం మరింత ముఖ్యం

జీవితపు ఒత్తిడికి
కొవ్వొత్తిలా కరగకుండా
నక్షత్రమై నిలచిపోవడం
ధీరత్వానికి నిదర్శనం!

(స్నేహితురాలు
అడ్వకేటు అరుణ కొసం)

# చైతన్యం

ఎక్కడ పీడన వున్నా
ఎక్కడ తాడిత జనం
తల్లడిల్లుతున్నా
ఎక్కడ అణచ బాటుతనం వున్నా
ఎక్కడ అర్హతలేని అధికారం
చలాయింపులో ఉన్నా
ఏదో ఒక గొంతు
ఏనాడో ఒకనాడు
అన్యాయాన్ని ఎదిరిస్తూ
ఆక్రందిస్తుంది
మరో గొంతు
అక్రమాన్ని చూసి
ఆక్రోశిస్తుంది
మరో గొంతు
ఎదిరించి తీరుతుంది
ఇంకో గొంతు
శృతిపలికి నడుస్తుంది
మరొకరి గొంతు
పిడికిలి బిగిస్తుంది
ఇలాగే గొంతూ గొంతూ కలసి
స్రవంతై నినదిస్తాయి
చైతన్యమై విప్లవిస్తాయి
కొత్త పరిణామానికి
పునాదులు వేస్తాయి

శ్రీలత

కొత్త వివేచనానికి
నాందీ పలుకుతాయి
కొత్త సిద్ధాంతాన్ని
ఆచరణలో పెడతాయి
ప్రపంచాన్ని వెలుగురేఖతో
ప్రక్షాళనం చేస్తాయి
అప్పుడు తప్పదు
అక్రమ అన్యాయ
పీడన తాడన
దుష్ట దుర్మార్గ
నష్ట అరిష్టాలకు
తిరుగులేని ఓటమి
జాగ్రత్త ఓ మగతనమా
జాగ్రత్త ఓ అహంకారమా
జాగ్రత్త ఓ అధికారమా
నీ హక్కులు దుర్వినియోగం చే_
నీకు దుర్మరణపు శిక్ష
ఎక్కడో ఎప్పుడో సిద్ధమయే ఉంది !

# తప్పిపోయిన బిడ్డ

నీతి న్యాయం ధర్మం
శాంతి సహనం
మానం మర్యాదలు
తెలిసిన నాబిడ్డ
మానవారణ్యంలో తప్పిపోయి
కొన్ని యుగాలయింది
ఎల్లలు దాటి స్నేహం చేసే
ఎదలను దూరి ప్రేమను మొలిపించే !
వేదనలు వినిస్పందించే
ఆక్రోశాలను అడ్డుకునే
కులమతాలను కూలదోసే
ఏకైక ప్రపంచాన్ని దర్శించే
మానవతతో పరిమళించే
మమత్వాన్ని పంచిపెట్టే
అన్యాయానికి అక్రమాలకు ఎదురు రొమ్ము విరిచె
ప్రపంచాన్ని పవిత్రంగా ప్రేమించే
మానవత్వంతో వెలిగిపోయే
మట్టిలోని మాణిక్యం వంటి
నాబిడ్డ ఈ జనారణ్యంలో
తప్పిపోయి ఎన్నోయుగాలయింది !
దుర్మార్గపు దౌర్జన్యపు
దానవులై మానవులు
మనిషితత్వం మరచి
స్వార్ధపురులై తిరుగాడే
ఈ ప్రపంచపు ఎడారిలో

నా బిడ్డ దాహార్తియై
ఎంతగా తపిస్తున్నాడో
ఒక్కసారి ఎండిబీటలు వారిన
మీ మనసు మూలల్లో
చిక్కు కున్నాడేమో
తవ్వి చూడండి
వెతికి నా కప్పగించండి.
నాగుండెకు హత్తుకుని
పెంచి పెద్దచెయ్యానివ్వండి
ఓమనుజుల్లారా
మనోజ్ఞులై వెలగండి
మనశ్శాంతి పొందండి !

# తెల్ల కాగితం కాదు

స్త్రీ జీవితం
వడ్డించిన విస్తరికాదు
అందుబాటులోని ఆనందం కాదు
పొంగుతున్న పాలకుండ కాదు
వండిన పరమాన్నం కాదు
ఘర్షణ పరివేష్టితం!
తప్పించుకోలేని సర్దుబాటుతనం
క్షణక్షణం అయిష్టంతో రాజీతనం
తినలేని వెగటు భోజనం
మింగుడు పడని అవసరాల సమూహం
చాలీ చాలన వస్త్రాలంకరణం
తీరీతీరని ఆశల వలయం
ఆగీఆగని జీవిత గమనం
వేటికీ ఎదురు తిరగలేని అశక్తతనం!
అన్నింటికీ విధివ్రాతే సమాధానం!
తనను తాను మభ్యపెట్టుకునే సహనం
తన ప్రమేయం లేకుండానే
నిర్ణయించబడ్డ
ఆజ్ఞల లొంగుబాటుతనం!
అందులోనుండి బయటకు రాలేక
కుడితిలోని వెలుకవలె
తన్నుకునే పోరాటం!
రెక్కల చిలుకకు
తప్పించుకోలేని పంజరం!
ఆశయాల మొలకకు
ఎదగలేని గిడసబారుతనం!
కాదందుకే అందరి జీవితం
ఇష్టం వచ్చింది రాసుకునే
నున్నటి తెల్లటి కాగితం

(వదిన ప్రమీలాకు)

# హక్కు

లంకలో బందీ అయిన
సీత ప్రతీకారం
కురుసభలో పరాభవం పొందిన
ద్రౌపది ధిక్కారం
ప్రబంధాలు ఒళ్ళుతడిమిన
పడతి ప్రతీకారం
భావ కవుల మనోన్మాదం చుట్టుముట్టిన
మహిళ మనః స్థయిర్యం
తిరుగులేని రాజ్యమేలిన
మహిళల రాజసం
ఆధునికంగా పోతపోసుకున్నాయి
పాతదనం మీద పగబట్టాయి
మమేకమై మేమేకమై
ప్రతి పడతిలో ప్రవేశిస్తామంటున్నాయి
బ్రతికినన్నాళ్ళు మీకు
పట్టెడన్నం పెట్టేది మేము
మరణిస్తే కడివెడు కన్నీరు కార్చేది మేము
కార్యేషు దాసులం
కరణేషు మంత్రులం
భోజ్యేషు మాతలం
శయనేషు రంభలం
అవునో కాదో తెలీదుకాని
వృద్ధాప్యంలో పోషకులం మాత్రం నిజం.
అందుకే
మాకు వంశవారసత్వం కావాలి

నిన్ను నేను పునర్నిర్మిస్తామని
ప్రతిజ్ఞపూని నిర్మూలించే
తలకొరివి హక్కు కావాలి
అని ఉద్యమం సాగిస్తామంటున్నాయి
అప్పుడు మాత్రమే
కొడుకుకోసం
కలవరించి
ఆడపిల్లయితే కడుపులోనే
హత్యచేసే అక్రమాన్ని
ఆపగలమంటున్నాయి !

# దరిద్రుని శవయాత్ర

పుట్టినందుకు
కెవ్వున నేనేడ్చా !
బ్రతికినన్నాళ్ళు
ఆకలి నన్నేడిపించింది !
పోయినందుకు
బావురుమని
నావాళ్ళేడుస్తున్నారు !
తనపసుపు కుంకుమల కోసం
ఆవిడ రోదన,
తమ పోషణ భారం
పోయిందని బిడ్డలవేదన,
అయ్యో పాపం
అంటున్నారు ఆత్మీయులు
బ్రతికిఉన్నన్నాళ్ళు
అక్కరకురాని వాళ్ళు
పోతే ఎలాగ
అంటున్నారు అప్పులవాళ్ళు
పోయిందని వాళ్ళ జిమ్మేదారు
ఒక్కొక్కరు కలసి
ఒక గుంపు అయ్యారు
నన్ను గౌరవిస్తూ
కొబ్బరి కాయలు కొడుతున్నారు
నాకు పూలు చల్లుతూ
సన్మానం చేస్తున్నారు

ధిక్కారం

చాలామంచివాడు పాపం
అని జాలి చూపిస్తున్నారు
నామీదకు డబ్బులు విసిరేస్తున్నారు
నన్ను మోయడానికి
బుజాలు మారుస్తున్నారు
చావుకు చేసే సాయం
బ్రతకడానికి చేస్తే
తలాఒక చెయ్యి వేస్తే
ఈరోజు ఈశవయాత్ర
జరిగేదే కాదు !

# కోరిక

జీవితం
చిల్లుపడిన కుండలోని నీరులా
జారిపోతూనె ఉంది
కాలం జీవితాన్ని
చేయి పట్టి వడివడిగా
లాక్కుపోతూనె ఉంది
మరణం వైపు మరింత వేగంగా
ఒక్కోక్షణం తోస్తునే ఉంది!
నేను మాత్రం
ఈ ప్రపంచపు మూలల్లో కూర్చుని
నిస్సహాయంగా చూస్తూనె ఉన్నా
ఒక్కక్షణం కూడా ఆపలేని కాలాన్ని!
ఈ సౌందర్య ప్రకృతిలో
మానవ సంబంధాలతో
శాశ్వత మవ్వాలని వుంది!
అనంతంగా ఈ రసమయ జగతిలో
జీవించాలని ఉంది!
కేవలం అందుకే
ఒక్క సిద్ధాంతానికైనా, సత్యానికైనా
త్యాగానికైనా, సమరానికైనా
సుఖాలన్నీ పక్కన పెట్టి
అంకితమవ్వాలని
ఆహుతి అవ్వాలని
అడవిలో ఆకులాంటి బ్రతుకుని
ఔషధపు వేరు చెయ్యాలని!

# ఇప్పటికైనా

ఎంతమంది సంస్కర్తలు
ఎన్నిదివిటీలు వెలిగించి
చుట్టూ చీకట్లను తరమాలనుకున్నా,
ఎన్ని విప్లవాలు
ఎన్నో గొంతులు కలసి
సమర్ధతను తట్టి లేపాలనుకున్నా,
ఎన్నో కాలమానాలు
గత చరిత్రలు తిరగరాసి
జీవితాలను మార్చాలనుకున్నా,
ఏంలాభం! ఏం లాభం
నువ్వొక పొరలుగా పేరుకున్న
స్థబ్దత్వానివై,
వినిపించని కనిపించని
ఆలోచించని అవివేకానివై,
నీకునీవు గిరిగీసుకుని
నీకు నీవు ఉరివేసుకుని,
చాందసపు ఊబిలో కూరుకుపోతున్న
అర్ధం పర్ధం లేని జీవానివై,
అడవి కాచిన వెన్నెలవై
జీవిస్తున్న శవానివైతే ఎలా ?
చాలు చాలు !
కోటి సూర్యకాంతుల జీవితం మరచి
మిణుగురుపురుగులతో కాలక్షేపం !
ఈ సృష్టిని ఏమాత్రం

అనుభవించలేని అశక్తతా
నీకోసమె ఎండవాన చలి
నీకోసమె సూర్యుడు చంద్రుడు భూవి
నీ కోసమె నీ జీవితం
నీ చేతులతో నీ గొంతు
పిసుక్కునే త్యాగాలు మాను
నీ కోసం మాత్రమె జీవించు
ఇప్పటికైనా కొత్త దృష్టిని సారించి
కొత్త తత్వం మొదలెట్టు!

# చిన్నిపాప

నా బరువుని
మెత్తని శరీరంగా దింపుతూ
మెల్లగా ఈలోకపు రంగుల్ని
చూసీ చూడనట్లు చూస్తూ
కంటి పాపగా మొదలై
బోసినవ్వుతో కళకళలాడుతూ
జీవితమంతా నిండిపోయావు!

ఇప్పుడు నా ప్రతిక్షణం నీదె
నీకోసమె నా సర్వస్వం!

నువ్వు లేనపుడు
నేనెలా జీవించి ఉన్నానోనని
ఆశ్చర్యం నన్ను ప్రశ్నిస్తుంది!

తప్పటడుగులతో నాయిల్లంతా
అహల్యలై నిండిపోయారు!

కేరింతలతో నాగుండె
ఆకాశమంత విశాలమయింది!

నీ చిన్ని చేతులతో
నాబుగ్గల మీది చారలు తుడుస్తావు!
నీలేత నవ్వుల్తో
నాలోని నిశబ్దపు పర్వతాలు పేల్చుతావు!
నేను చైతన్యమై నీవెంట
నవ్వుల పువ్వులు పూస్తా

ప్రతిక్షణం నీకె అంకితమిస్తూ
పరమానందంగా జీవిస్తా !
చిన్నిపాపా !
నా పేగులు పూచిన వాసంతమా
నువు ఎదిగి జీవితాన్ని మథిస్తూ వుంటే
నువు సాధించిన విజయాల సంద్రంలో
నేనూ ఒక చుక్కనై కలసిపోతా !

# జైలు పక్షులు

(న్యాయ చరిత్రలో ఒక వ్యక్తి
చిన్న తప్పుకు జైలులోకి వెళ్ళి
విచారణ జరగక జీవితమంతా
జైలులో గడపిన సంఘటన)
...............................
ఏ ఆకలి నిన్ను ఉసిగొల్పిందో
ఏ కష్టం నిన్ను ప్రోత్సహించిందో
ఏ అవసరం నిన్ను తప్పు చేయించిందో
తెలీదు కానీ....
చిన్నతప్పుకు న్యాయం దృష్టి కందక
జీవిత ఖైదీవై కటకటాల వెనుకనీవు !
పంజరంలో పావురాయిలా
బందీవయిన నీ నిస్సహాయతకు
జైలు ఇనుప తలుపులు తెరుచుకోవు !
నిన్ను విడిపించే స్థాయి స్తోమత నాకులేవు
న్యాయం చేస్తున్న నిర్లక్ష్యం నీవు
అధర్మానికి ఆదర్శం నీవు
చెట్టం చెరబట్టిన అమాయకత్వం నీవు !
అసలు తప్పులు చేసే వాళ్ళు
సంఘంలో దర్జాగా తిరుగుతుంటే
నీలాంటి పేదల జీవితాలలో
న్యాయం హత్య చేయబడింది !
ఏనాటికైనా తిరిగి వస్తావని
కొండంత ఆశతో బండరాయినై
కటకటాల ఇవతల నేను !

రాజకీయ వలలు నిన్ను
జీవితమంతా జైలు పాలు చేస్తే
నీకోసం నేను నిర్జీవమై
సంఘపు అవకాశపు వలలో చిక్కి
గిలగిలలాడుతూ ఊపిరి నిలుపుకుని
నీళ్ళుఎండిన కళ్ళతో
ఆశల తళుకులు మెరిపిస్తూ
నీకోసం నిరీక్షణమై నిలుచున్న
జీవితం చాటు ఖైదీని నేను !

# మరలిరాని పయనం

ఎముకల్ని ఎముకల్లోకి
పొదుపుకుంటూ
చర్మాన్ని చర్మంతో
ఒరుసుకుంటూ
తనలోని తానే ఇమిడిపోతూ
ఇహలోక ధ్యాస మరచిపోతూ
కళ్ళు కానరాక
చెవులు వినరాక
మరుపు కమ్ముకురాగ
మైకంలో గొణుగుతూ
చీకట్లో తడుముతూ
అర్థం కాని శబ్దాలకు
బదులు పలకాలని
నోరు విప్పినా పెదవులు కలసిరాక
రక్తం పలచబడి
నరాలు బిగదీసి
కనురెప్పలు కలిసిపోయి
చిన్నప్పటి కథలు కలలై
నరక ద్వారాలు చూపించగ
పుటుకుమని విరిగేలా వున్నవేళ్ళతో
టెంకపీచులాంటి జుట్టు గోక్కుంటూ
చిటుకుమని సవ్వడయినా
అది తనకోసమనే ఉలికిపడుతూ
పగలో రాత్రో తెలీక

తన బిడ్డల పోలికలు కూడా మరచి పోయి
ఒంటరి ముసలితనం
పలకరింపు వినబడితే
పోయి వస్తానని చెబుదామని
సర్వం విడుచుకుని
ప్రయాణానికి సన్నద్ధమై
ఎప్పుడింకెప్పుడని గొణుక్కుంటూ
ఒకటే ఎదురుచూపు
మరలిరాని పయనం కొరకేమొ ?

# విహంగం

ఎన్నాళ్ళీ ముసుగులో గుద్దులాట
ఎన్నాళ్ళీ హక్కులతో దోబూచులాట
ఎన్నాళ్ళీ సిద్ధాంతాలు వల్లెవేయుట
నన్ను స్థిరంగా నిలపడానికి
ఎందుకు నాకీ సంకోచపు పెనుగులాట
అనుకుని అడుగు ముందుకేశా!

ప్యూపా దశనుండి
స్వేచ్ఛా విహంగమవుదామనుకున్నా
కానీ మధ్యలో గొంగళి పురుగును చేసి
ఆనందించిందీ సృష్టి
వికృతత్వానికి విరగబడి నవ్విందీలోకం
దగ్గరకొస్తే కాలరాయాలని చూసిందీ ప్రపంచం
చీడ పురుగు వంటూ చంపబూనిందీ సంఘం

ఈ దశనుండి విముక్తికై
అహర్నిశలూ పోరాటం చేసి
క్షణక్షణం ఆరాటపడి
సీతాకోక చిలుకనవడానికి
శక్తినంతా ధారపోసి
ఎంతో పరిణామం పొంది
పూర్ణరూపాన్ని సాధించి
అందమైన రెక్కలు సృష్టించుకుని
ఆలోచనల రంగులు దిద్దుకుని

ప్రపంచ వృక్షమయింది
స్నేహ్న సమాగమై
అమృతమైన జీవిత మధురిమలు
తాగుతు మంచున్న నన్ను మారి
నేటినుంచి అందరిదీ లోకం
పచ్చదనై మారుతుంది ప్రపంచం!

(పిల్లి కమలక)

# కాలపు కసి

కలవని రైలు పట్టాలలాగా!
కాలంతో పాటే
కాలానికి దొరక్కుండా
పరుగులెత్తుతూ ప్రయాణంచేస్తున్నా,
కాలానికి ఎంత కసో!

ఎప్పుడో తీరికవేళ
ఏకాంతంలో ఎదనుఢీకొట్టి
ఆలోచనల అనంతంలోకి నెట్టి
గుండె పట్టులోంచి జారిన
బాల్యపు తేనెచుక్కల తాలూకు
తీపి మరకలు చూపి
వేదనకు ఎర్రబడ్డ కళ్ళుచూసి
వెక్కిరించి పోతుంది!

కసిగట్టిన ఈకాలమె
జీవితాన్ని పిండి
బాల్యాన్ని దోచుకుంది!
పకపక నవ్వాలన్నా
పరుగులు తీయాలన్నా
పరవశించిపోవాలన్నా
తోడుగా బాల్యం లేదిప్పుడు
బలవంతపు బాధ్యతల బరువుతప్ప!
ఐనా కాలానికి కసితీరలా ?

పరువపు పర్వతాల సానువుల్లో
సాముచేసి సాహసమనుకుని
యవ్వనాన్ని సైతం దోచేసి
నిర్వీర్యత నింపింది
నిలకడ లేకుండా చేసింది!
ఆదర్శాల వల్లికలు లేవిపుడు
ఆచరించింది తప్పొరైటో తెలీక
సాధించింది చేజారు తుందని
తర్జన భర్జన చెందే తమకంతప్పు!

అయినా కాలానికి కసి తీరలా
వెంట్రుకలు తెల్లబరిచి
వేదాంతిని చేసింది
మూడోకాలు చేతికిచ్చి
ముసలివాణ్ణే చేసింది.
మూలక్కూచోబెట్టి
మురిపాలు చంపింది!

కానీ పిచ్చి కాలానికేం తెలుసు
మనిషెంత కొంటెవాడో
వెర్రి కాలానికేం తెలుసు
మనిషెంత మొండివాడో!

నాలో ముడతలు పడ్డ
ముదిరిన ఆలోచనల్ని
మాలిష్ చేసి పాలిష్‌చేసి
మళ్ళీ కొత్త జీవం పోసి

మనవళ్ళతో మనవరాళ్ళతో
పక్కింటి ఎదురింటి పైనింటి

పిల్లలతో అల్లరిగా
చినుకుల్లో తడుస్తూ
పడిపడి లేస్తూ
పకపక లాడుతూ
మళ్ళీనేను బాల్యంలోకి వచ్చేశా !
మళ్ళీ నేను బ్రతుకు మొదలెట్టేశా !
ఈసారి నన్ను ముసలివాణ్ణి చేయడం
కాలం తరం కానేకాదు !
కసికట్టిన కాలం బిత్తరపోయేలా,
కాలాన్ని నాకొత్త బాల్యంలో ఆపేశా !

# చీకటి కథ

చాలు చాలు
నువ్వొద్దు!
నీ సాహచర్యం వద్దు!
నువ్విచ్చిన అనుభూతులూ వద్దు!
వాటి ద్వారా నేను పొందిన
అనుభవాలూ వద్దు!

నన్ను వెన్నంటి రాకు
నన్ను నన్నుగా వెలుగుతూ ఉండనీ!
అని సాయం సంధ్యవేళలో
మసక వెలుతుర్లో
ప్రతి పగలూ అనాదిగా
రేయితో అంటునే ఉంది!
రాత్రిని మాపాలని
చీకటిని తరమాలని
అకృత్యాలు ఆపాలని
అక్రమాలు నిలపాలని
ఆక్రందనలు ఆదుకోవాలని!

ఎన్ని విద్యుద్దీపాలు వెలిగించి ఎదిరించినా
రాత్రి వస్తూనే ఉంది.
తన పని చేస్తూనే ఉంది!

విసుగు చెంది వేసారి
చంద్రుణ్ణే పహారా పెడితే,
చీకటితో చేతులు కలిపి
అరకన్నుతో కాపలా కాసి

ప్రతి అమవసకు సెలవు పెట్టి,
రాత్రి బలం పెంచి
నైతిక బలం జార్చుతున్నాడు !

రాత్రి పగలును ఆక్రమించింది కాబోలు
చీకటి వ్యాపారాలు
పగలే జోరుగ సాగుతున్నాయి
దారుణ మారణ కలాపాలు
పగలే పట్టం కడుతున్నాయి !

చూడలేని పగలు
సూర్యుణ్ణొదిలేసి కళ్ళుమూసుకుందేమో
అందుకే అప్పుడప్పుడు
బ్రతుకు చీకటనిపిస్తుంది
పట్టపగలు పదిమందిలోనే
చీకటి భయం వెన్నంటుతూంది !

# అనుబంధాలు

పసిబిడ్డగా పాలుతాగుతూ
అనుకుంటున్నాడు
అమ్మ లేనిదే బ్రతకలేనని!

పడుచుతనంలో ప్రియురాల్ని చూసి
మురిసిపోతున్నాడు
ఆమె తన సర్వస్వమని

భర్తగా భార్యను చూసి
అనుభూతిస్తున్నాడు
తన జీవితం ఆమెతోనేనని!

తండ్రిగా సంతానాన్ని చూసి
ఉబలాట పడుతున్నాడు
తన భవిష్యత్తు వారితోనేనని!

తాతగా మనవడ్ని చూసి
తపన పడుతున్నాడు
తనకు వారసత్వం వీడేనని!

అన్నీ చవిచూసిన వృద్ధుడుగా
వార్ధక్యంతో బాధపడుతున్నాడు
మృత్యువొక్కటే తననీ
జన్మ బాధలనుండి విముక్తి నిచ్చేదని!

# స్థిమితం

మౌనపు శిఖరాలివి
బద్దలు కానివ్వు
మాటల పెన్నిధులను
ముందుకు రానివ్వు

నిర్లక్షపు గోడలివి
తలుపులు తెరువనివ్వు
లక్ష్యగామివై
అడుగులు కదలనివ్వు

నిరాశా వాదాలివి
అడ్డుపుల్ల వేయనివ్వు
ఆశాజ్యోతులను
అంతరంగాన వెలుగనివ్వు

వేదనా తరంగాలివి
ఆనకట్ట వేయనివ్వు
సంతోషపు మధురిమలు
హృదయాన కురవనివ్వు

స్థితప్రజ్ఞతవై
మనఃస్థిమితం కానివ్వు
మనః ప్రజ్ఞతవై
చిరకాలం జీవించి పో నువ్వు !

శ్రీలత

# మీరెప్పుడైనా గమనించారా

కర్రపోటు ఆనలేక
బక్కచిక్కిన వృద్ధుడు
కారుకింద పడటం!

ఆకలి పోటుకు
ఊరిబయట చెట్టుకింద
ఒంటరి ముసలిది ప్రాణం విడవడం

నడిరోడ్డుపై వళ్ళు మరచి
లజ్జవిడిచి అరుస్తూ
పిచ్చిది ప్రసవించడం

బొడ్డుకోసే దిక్కులేక
పుట్టిన బిడ్డ
పురిటిలోనే ఊపిరి విడవడం!

కుష్టురోగం తగ్గక
ముష్టివాడు రాళ్ళడబ్బాతో
రాగాలు పాడటం

మీరెప్పుడైనా గమనించారా?
ఒక్కరికైనా సాయపడ్డారా?
మనుజలోకంలో మానవత్వానికి,
ప్రాణం పోసి బ్రతికించారా?
స్వార్థం వీడి పావనమయ్యారా?
ఒక్కసారైనా బ్రతుకుని అర్థం వేసుకున్నారా?

# ఒక్కసారైనా

జీవితంలో ఒక్కసారైనా
పువ్వును చూసి
పులకరించకపోతే
నవ్వును చూసి
నవ్వలేకపోతే
పాటను విని
పరవశించకపోతే
కవితను విని
స్పందించకపోతే
మనసును దోచి
మురిసిపోలేక పోతే
గొప్పతనాన్ని విని
శ్లాఘించకపోతే
బాధను చూసి
ఓదార్చకపోతే
వ్యర్థంవ్యర్థం
నువ్వోక వ్యర్థపదార్థం
ప్రకృతికే విరుద్ధం
ప్రపంచానికే వైరుధ్యం
నీ నిర్మూలనకు నీవె సర్వసన్నద్ధం !

# కావిడి కుండలు

పూల వనాలలో
కీమురాళ్ళుంటాయని
పున్నమి కడ్డంగా
కారుమబ్బులుంటాయని
రమ్యమైన బ్రతుకు ప్రయాణంలో
చికాకుల చింతల
సుడులుంటాయని
తెలిసి తెలిసీ వగపెందుకు ?
ఆలోచన లేని ఆవేదన ఎందుకు ?

నలుపు పడిందని
కన్ను పొడుస్తామా ?
ముల్లు గుచ్చిందని
కాలు నరుకుతామా ?
జోరీగల జోరు పోరుకు
కలత చెంది నిదుర మరచేమా ?
పరిష్కారం దృష్టి కందక
మసకబారి మౌన మౌదామా ?

కన్నీటి నాపే రెప్పలున్నాయి !
కలతలను బాపే నవ్వులున్నాయి !

కష్టమైనా ఇష్టపడితే
కడలిలో తెప్ప కదలిపోదా !
రోష్టను కున్న ప్రతిదీ
శిరోభారమై వేధించదా !

ఇష్టాయిష్టాల కావిడి కుండలు
ఖజాన మోసే బాటసారులం
అయిష్టం వెనుకబడి అనుసరించినా
ప్రతీసారి ఇష్టంవైపే ముఖంపెట్టి
సుఖంగా ప్రయాణం చేద్దాం!

# పోరాటం

పోనీ ! పోతేపోనీ!
నా వాళ్ళంతా
నట్టేట ముంచి పోనీ
నాదను కున్నదంతా
నేలపాలు కానీ
ఏదీలేని ఏకాంతంలో
నేను మాత్రం మిగలనీ !

నలుదిక్కులూ ఏకమై
దిక్కుతోచకుండా చేయనీ
సూర్య చంద్రులు భ్రమణం మాని
శూన్యం నింపి పోనీ
పుడమి దద్దరిల్లుతూ
భీభత్సం జరుపనీ
సముద్రాలుప్పొంగి
సర్వం ముంపుకానీ
సమస్తం ఏకమై
నన్ను గెలవాలని ప్రయత్నించనీ !

నేను మాత్రం,
నిదానమై
నిమ్మళమై
నివాళమై
నీరవమై
విశాంతిలో ప్రశాంతమై
నా ఊపిరి కోసం
పోరాటం చేస్తా!

ఊపిరున్నంత వరకూ
అస్తిత్వం కోసం
ఆరాటపడతా !
అస్తిత్వంతో
నాదైన కొత్త పంథావేస్తా !
ఆ పంథాలో నేను మాత్రం
ప్రయాణం చేస్తూనే ఉంటా !
ఒకనాటి కది రహదారై
రాచబాటై రాజిల్లుదాకా !

# జాడలు

కన్నీరు జారనీకు
అవి కష్టాల తరంగాలు కావు,
బాధల వరదలూ కావు,
పిరికి తనపు ప్రవాహాలు
అసమర్థతకు ఆనవాలు !

ఓదార్పు కోరుకోకు
నిన్ను సేదదీర్చదు
జాలిపడి ఊరడించదు
అవకాశం చూసి గేలిచేస్తుంది
అశక్తతను ఎత్తి చూపుతుంది !

అలసట చెందానను కోకు
అది విశ్రాంతి నివ్వదు
కార్యోన్ముఖుణ్ణి చెయ్యదు
ఆసక్తిని చంపుతుంది !

స్థిత ప్రజ్ఞవై
స్థిరచిత్తవై
అడుగుల జాడలు వేస్తూ
గమ్యం కేసి నడిచిపో !

# అంటువ్యాధి

నా తరాన్ని పీడిస్తున్న
తీవ్రమైన జబ్బు నే కనుక్కున్నా
మందేమిటో తెలిసినా
ఒప్పుకొని మూర్ఖత్వం పెంచుకున్నా!
అమ్మా నాన్నా పల్లెటూళ్ళో
కూతురూ కొడుకూ హాస్టళ్ళో
నాకు పనుల ఒత్తిడి
ఆవిడకు ఆడంబరాల సందడి!

ఉమ్మడి కాపురాల్లేవు
ఊకదంపుడు కబుర్లులేవు
వెన్నెట్లో తాతయ్య కథల్లేవు
సందెవేళ నానమ్మ జంతికల్లేవు!

పిల్లల అల్లరిలేదు
పెద్దవాళ్ళ మురిపెంలేదు
ఇంట్లో మాటల పనిలేదు
ఇరుగు పొరుగు అవసరంలేదు!

కలివిడితనం లోపం
ఒంటరితనం రోగం!
ఊరికెనే కోపం
చీటికీ మాటికీ చిరాకు
పలకరిస్తే పరాకు
అర్థంకాని ఆవేశం!
అవసరం లేని ఆయాసం
అదేవిటని ఆలోచిస్తే

అదోలాంటి నీరసం
ఇవీ రోగాలలక్షణాలు !

ఈ రోగం
రోజు రోజుకూ ముదురుతూంది
అంటువ్యాధై ప్రబలుతూంది
మనసు మరణాల రేటు
మన దేశంలో కూడా
మరీ మరీ పెరుగుతూంది !
సామూహిక బలం లేక
సామర్ధ్యపు శాతం
కిందకు పడిపోతుంది !

# చిరునవ్వు

కనులు మెరిసి
మోము విరిసి
మనసు తేలికపడి
అధరం అరవిడి
హాయనిపించే
అనుభూతి వెలువడి
మౌనం విడివడి
ఎక్కడయినా
నీ వాళ్ళను ఏర్పరచి
ఏ భాషలో నయినా
నీ భావం వెలువరించి
ఎంత శత్రువునైనా
క్షణంలో నీరసపరచి
స్నేహాన్ని వెలయించి
ప్రేమను మొలిపించి
సాన్నిహిత్యం పెంచే
అతి చిన్న
అమూల్యమయిన
అతి సులభ సాధ్యమయిన
పాశుపతాస్త్రం
చిరునవ్వు!

అది నీలోనే వుంది!
ఎల్లప్పుడూ
సంధించి ఉంచు!

ఇకనీకు
ఆత్మీయులేగాని
శత్రుత్వమెక్కడిది!
శాంతేగాని
సమస్యలెక్కడివి!
సంతోషమేగాని
సంతాపమెక్కడిది
పరిచయస్తులంతా
మమత్వం పంచుతారు
పరిపూర్ణుడవై ప్రకాశిస్తావు
బుద్ధుని వలె సిద్ధత్వం పొందుతావు!

# మనసా

చిత్రమైనవే మనసా నీచేష్టలు !
ఎవ్వరెరుగరే నీ లీలలు
సర్వంసహ నీవె
సర్వసంగ పరిత్యాగివె !

నీ అలసటే ఆవేశం
నీ అలజడే ఆవేదన
నీ విలాసమే లాస్యం
నీ విశ్రాంతే శాంతి
నీ మురిపెమే వాత్సల్యం
నీ యోచనే సిద్ధాంతం
నీ నిరాకరణే విరక్తి
నీ అంగీకారమే రక్తి !

నీ బలమే పరమవిజయం
నీ బలహీనతే పరాజయం
నా యంత్రణ నీవె
నా నియంత్రణ నీవె !

వివేకమై, విలోచనమై
స్థిరమై, స్థిత ప్రజ్ఞవై
నను నడిపించవే
జీవన సాగరంలో
భావ సంచలనంలో
సర్వదా సుమార్గదర్శికావే !

# జీవితం

జీవితం
కనురెప్పపాటులో
బ్రతుకుదోసిలివిడి
జారు పాదరస క్షణసమూహం!
శాశ్వతమని, నిస్వంతమని
మురిసి పోవకే మనసా!
ఏ క్షణం అవివేకానికి అంతమో,
ఏ క్షణం శ్రమకు అంకితమో
ఏక్షణం వివేచనా సహితమో
ఏక్షణం పరోపకార నిర్ణీతమో
ఆ క్షణ మొక్కటే శాశ్వతం!
అశాశ్వత క్షణాల సమాహారమే
చిరస్థాయి నొందిన జీవితం!

# వైకుంఠపాళి

బొంబేలో బాంబులు పడితే నాకేం!
మదరాసులో మర్డర్లయితే నాకేం!
హైదరాబాదులో అల్లర్లయితే నాకేం!
అసలెక్కడేం జరిగినా నాకేం!

నాయిల్లే నాకో గందరగోళం,
నా బ్రతుకే క్షణ క్షణ సమరం,
ఎప్పుడూ సమస్యల బాంబు పేలుతూనే ఉంటుంది!
మౌన సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది!
కుమార రత్నం నిరక్షరకుక్షి,
కూతురికేమొ టీవీ పిచ్చి,
తల్లి కాయం రోగాలయం,
ఆలి హృదయం మోజుల నిలయం!

ఆదాయం బెత్తెడు
అవసరాలు బారెడు!
ఆశలు చిటారు కొమ్మన
అడుగులు పాతాళంబున!
తెల్లవారితే వెతలదాడులు
పొద్దుకుంకితే దోమలదాడులు!

పగలేమొ అడ్డ చాకిరి!
రేయేమొ దిగులు తాకిడి
జీతమంతా అప్పులపాలు
నెలసరి ఖర్చుకు ఖాతా మొదలు!

ఆకలేమో అందరి సొత్తు
సంపాదన ఒక్కడి వంతు
తాత తద్దినానికి
కొత్త సంక్రాంతికి
ఖర్చొక్కటే తేడాలేదు !

గెలవలేని ఓడలేని మా జీవనాలు
వైకుంఠ పాళి ఆటల గమనాలు
రెండు మెట్లెక్కితే చిన్న పాము
నాలుగు మెట్లెక్కితే పెద్దపాము
ఎన్ని మెట్లెక్కినా మళ్ళీ మొదటికే

అందుకే మా జీవితాలు
మింగలేని కక్కలేని
చేదు పాయసపు విందులు
లోకం పట్టని ఇరుకుసందులు

# మరుపు

నీ ఆనందాన్ని, నీ ఆవేదనను
ఆలోచననూ, నీ అంతరంగాన్నీ
నీ సాహచర్యాని, నీ సామర్థ్యాన్నీ
పంచుకోనివాళ్ళని
హర్షించని వాళ్ళని
మర్చిపో తొందరగా మర్చిపో !

కావలసినవాళ్ళు కారాగారామైతే
అయినవాళ్ళే ఆయుధాలు నూరితే
అవసరమనుకున్నవాళ్ళు ఆవేదనరేపితే
మర్చిపో తొందరగా మర్చిపో !

నిరాశ నిప్పై కాల్చక ముందే
అశాంతి ఆవిరై కమ్మకముందే
అసంతృప్తి భారమై అణచకముందే
మర్చిపో తొందరగా మర్చిపో !
వాళ్ళ గురించిన ప్రతిదీ మర్చిపో !

# నాగరికత

ఐదంతస్తుల మేడలోంచి
గూర్ఖా కాపలా నుంచి
అద్దాల కారులో
అమ్మదగ్గరకు వెళుతున్నా!

అక్కడ పూరింటి ముందు
నులక మంచానికి
తాడుపేనుతూ నాన్న
కళ్ళాపి ఛల్లి
ముగ్గులు పెడుతూ అమ్మ
నాకోసం ఎదురు చూస్తుంటారు
సూర్యోదయాలను లెక్కపెడుతూ!

ఏదో ఒక ఉదయాన్న
నేను హడావిడిగా వెళ్తా
వెలుగొచ్చినట్టు వాళ్ళు
కళ్ళు చికిలించి చూస్తారు

ముడుతలు పడిన చేతితో
వళ్ళంతా తడుముతాడు నాన్న!
వంగిపోయిన నడుముతో
సున్నుండలు పెడుతుంది అమ్మ!

అవీ ఇవీ తింటా
ఈ యేడు పంట లాభాలడుగుతా
పొద్దుపోయింది వెళ్లొస్తానంటా!

ధిక్కారం

ప్రయాణం జాగ్రత్త
వేళకు అన్నం తిను
పిల్లలు భద్రం అని
పదేపదే చెబుతాడు నాన్న

మళ్ళెప్పుడంటారిద్దరూ
పంటకాలాని కంటా !

(పెదనాన్న పెద్దమ్మ
కోటేశ్వరరావు జయలక్ష్మిలకు)

# జాగ్రత్త

నీ జీవన చిత్రంలో
బిడ్డ పాత్రధారిగా మొదలిడి
సోదరుడై లేదా సోదరివై
భర్తవై లేదా భార్యవై
అమ్మవై లేదా నాన్నవై
అవ్వవై లేదా తాతవై
సాగుతూ అంతమై
ఇంతే అనుకోకు!

ఏ పాత్రకు ఆపాత్రే విశిష్టం!
ఎన్నో పాత్రలను చాకచక్యంగా
పోషింప చేసేదే జీవితం!
ఎప్పటికప్పుడు నీ పాత్రలను నీవు
సంపూర్ణంగా ధరించు!
సంతృప్తిగా నిర్వహించు!

ఏ పాత్ర కన్యాయమైనా
అది నిర్లక్ష్యమై
నిన్ను శపిస్తుంది!
నీ భవిషత్తై నిన్ను సాధిస్తుంది
నీ అంతరాత్మే నిరంతం ఘోషిస్తుంది
నిన్న శాంతి పాలు చేస్తుంది
చివరకు నీమనుగడనే దెబ్బతీస్తుంది.

# ఓటమి

ఎందుకు ?
ఓటమి ఒక్కోసారి
నన్నిలా కోరలు సాచి
వికృత రూపంలో
నాచుట్టూ కరాళ నృత్యం చేస్తూ
భయపెడుతున్నాననుకుంటుంది !

దానికేం తెలుసు ?
తలుపు మూసి బెదిరిస్తే
పిల్లే పులవుతుందని !
ఓటమే కోటి వెలుగులతో
పిరికి తనాన్ని పారదోలుతున్నదని !
కొత్త తేజంతో
రేపటి ఉషోదయాన్ని
నా ముందు నిలుపుతోందని !

అందుకే
ఓటమి పేరు మార్చి
అనుభవాల కూటమి అంటాను
మరో ఆరంభానికి సూచన అంటాను
అవివేకానికి పరాకాష్ట అంటాను.
వివేచనానికి పునాది అంటాను
ఏవి ఏమన్నా, ఏది ఏమయినా
అప్పుడప్పుడూ ఓడిపోవడం
అవసరం అంటాను.

# వలస

దారిలోనే కదా అని
తీరికచేసుకుని మావూళ్ళోదిగా !
కనిపించిన ఎవర్నో అడిగా
మావూరు సంగతులేమిటని
నిరాశగా మూల్గుతూ వివరించింది !

మావూళ్ళో చెట్లకు ఆకులు లేవని
అవిపెట్టుబడులై పట్నం చేరాయని !

అల్లరి కోయిలలు అసలే లేవని
అవి చదువుకని వలస వెళ్ళాయని !

వానాకాలం మబ్బులు రావని
అవి మా పెద్దాళ్ళ గుండెల్లో గుబుళ్ళైనాయని !

చలికాలం లేలేత చిగుళ్ళుండవని
అవి ముదిరి అడియాసలై రాలిపోయాయని !

కాలమంతా ఒక్కటే అక్కడ
క్షణమెలా గడుస్తుందో అనేకాని
ఎలా గడిచిందో గుర్తురాదు వాళ్ళకు !

ఒకరు పోతే ఇంకొకరు ఏడ్వరు !
ఈరోజు నావంతు కాదనుకుంటారు !
పట్నం నుంచి వారసుడు రాలేదే
తగలెట్టడమెలా అని ఎదురు చూస్తారు

ముదిరిన ఎముకలు మొరాయిస్తుంటే
సణుగుతూ గొణుగుతూ
మా పెద్దాళ్ళంతా తచ్చాడు తుంటారు !

ధిక్కారం

ఎందుకంటే
మావూరు కొత్తతరం
ఇక్కడ వినోదాలకు
విలాసాలకూ కరువొచ్చిందని,
పైపై మెరుగుల పట్నం వలస వెళ్ళింది!
మా వూళ్ళో ఊత కర్రలకు
కొరతొచ్చింది.

# ప్రశ్న

నాకు తెలుసు!
భూమ్యాకాశాల మధ్య
నేనొక అణుమాత్రాన్నని!
అయినా నేను,
భావిస్తాను, భాషిస్తాను
రోదిస్తాను, శోధిస్తాను
జ్వలిస్తాను, శాంతిస్తాను
ప్రణయమై, ప్రళయమై
ప్రణవమై, ప్రకోపమై
ప్రశాంతమై
ప్రకృతిని శాసించి
సృష్టినే ప్రశ్నిస్తాను
ఎక్కడిది నా కింత శక్తి
అని అనంతం కేసి అడిగాను!
అరికాలు ప్రక్కన అమీబా నవ్వింది!
అణువైనా అస్తిత్వం ఉంది
ఆమాత్రం చాలదా అంది.

# మౌనమైన మనసా

చలనమే సృష్టికి
మూలమని తెలుసా
మూగబోవుట
జడత్వమని తెలుసా
మౌనమైన మనసా
చలించి సంచలించి పోవేమే

ఇంత పరాకేలనే
అల్లరి గాలిపై రేగవె
అలవోకగ చిగురాకుల
ఊయలలూగవేమే

ఇంత నిశ్చలనమేలనే
అల్లన మెల్లన
మరుమల్లెల పరిమళాల
తేలియాడి మురియవేమె

ఇంత నిశ్శబ్దలన మేలనె
సందె వేళలో
స్వాతి చినుకులరో
చెంగలువవైవి రియవేమె

ఇంత నిర్లిప్తతెందుకే
గలు ఘల్లున
నటరాజ మువ్వలా
మ్రోగి నర్తించవేమె !

# వ్యత్యాసం

చిటికెడు చక్కెర చూస్తే
చీమ దండును పిలుస్తుంది
పిడికెడు నూకలు వేస్తే
పిట్ట గుంపుకు కబురెడుతుంది

ఒక్క కాకి చచ్చిపోతే
కాకులన్నీ పోగవుతాయి
ఒక్క జంతువు దొరికితే
డేగలన్నీ పంచుకుంటాయి.
నేనుమాత్రం

గుప్పెడు లాభం కనిపించినా
కొండంత కలిమి కలిసొచ్చినా
ధనకాంక్షతో
రేయి పగలు కాపలాకాస్తా

ఒక్కడినే అనుభవించాలని
ఎవరైనా దోచుకుంటారేమోనని
ఆత్రంగా దాన్ని పొదువుకుంటా
దానికోసం పక్కవాడినే హత్యచేస్తా
జాతినే హరింప చూస్తా
అంతర్జాతీయంగా ఇంకా
దోచుకోవాలని చూస్తా

# వెలుతురు

ఒక సాయంత్రం
కాలం అగ్గిపెట్టెలోంచి
అనుభవాల అగ్గిపుల్లతీసి
ఆలోచనల దీపం పెడదామని
చీకట్లో వెతుకుతున్నా!

ఏమూల నుంచో నిశ్శబ్దం
అలికిడిగా అడిగింది
ఎవరు నువ్వని ?

ఈరోజు ఒకరి కూతుర్ని
రేపు ఒకరి భార్యని
ఆ మరునాడు ఒకరి తల్లిని అన్నా గర్వంగా

అగ్గిపుల్ల అంటుకుని
అదేపనిగ నవ్వింది!
నవ్వాపి
అంతేనా ఇంకేమీకావా
అని ఆరిపోయింది!

# తపన

నా చిన్నారి కన్నా
నే పొదిగిన అందాల ఆణిముత్యమా
నా ప్రాణపు గూటిలోని జాబిలి కూనా
నా ప్రాంగణపు పరిధిలోని వెన్నెలసోనా
నా ఆశల రంగుల లోకమా

నువ్వు అమ్మా అంటే
నా పేగులు గలగల లాడవా
నువ్వు తప్పటడుగులు వేస్తుంటే
నా గుండె సంభ్రమై పొంగదా

నువ్వు నవ్వుతూ తిరిగితే
వెన్నెలలు వెలవెల బోవా
నువ్వు ఏడుస్తూ కనిపిస్తే
నా ఎద పెటిల్లున పగిలిపోదా

నిన్ను ప్రపంచంలోకి తేవడానికి
కొన్ని నెలలే కష్టపడినా
నిన్ను జగతిలో నిలపడానికి
బ్రతుకంతా ధారపోయనా

నువ్వు రెక్కలు విప్పార్చి ఎగురుతుంటే
నువ్వు అంచెలంచెలుగా ఎదుగుతుంటే
నా ఆయుష్షు కూడా నీకు పోసి
నేను నిశబ్దమై నిష్క్రమించనా!

(శ్రీకాంత్ కోసం)

# అబార్షన్

అమ్మా! నన్ను చంపకు !
నాన్నా! నన్ను బ్రతకనివ్వు !

ఆడపిల్లననే నెపంతో,
అధికభారమనే భావంతో,
వంశాకురం కాననే ఆలోచనతో,
అమ్మా ! నన్ను చంపకు !
నాన్నా ! నన్ను బ్రతకనివ్వు !

నాకే ధర్మ శాస్త్రాలూ తెలీవు
నాకే ధనవ్యయాలూ తెలీవు
నాకే సంఘ మర్యాదలు తెలీవు
నాకే సంస్కరణ వాదాలూ తెలీవు

చీకట్లో యిప్పుడే ప్రాణం పోసుకున్నా
వెలుతుర్ని చూడాలని వేగిరపడుతున్నా
అందమైన లోకం ఉందిట
అందులో ఎన్నో రంగులు ఉన్నాయట

ప్రతి చెట్టుకు
ప్రతి జంతువుకు
ప్రతి పూవుకు
ప్రతి కొమ్మకు
ప్రతి రెమ్మకు
ప్రతి పిట్టకు
అసలు ప్రతి జీవికీ

అణువునుండి అనంతం దాకా
పుట్టుకనుండి మరణం వరకూ
బ్రతికే హక్కు ఉందిట
నన్నొక్కసారి వూపిరి పీల్చుకోనివ్వు
నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వు

కత్తులతో నను కత్తిరించి
కటారులతో ముక్కలు చేసి
రక్తధారలుగా స్రవింపచేయొద్దు
నాకు బ్రతకాలనుంది
నా బ్రతుకునన్ను బ్రతకనివ్వు

అమ్మా ! నన్ను చంపకు
నాన్నా! నన్ను బ్రతకనివ్వు

(చంద్ర కోసం)

# హృదయ తరంగం

ప్రాతః కాలాన రాలు పారిజాతాలు
ఒక్కొక్కటీ ఏరి ఒడినింపినట్టు,
బ్రతుకంతా మెలకువగా
ఏ కాంతపు క్షణాలను ప్రోగుచేస్తా!
కాలగమనంలో పడి నలిగి
అవి నీజ్ఞాపకాలలో కూడా మిగలవు!

మబ్బుగుండెల్లోని మంచు ముత్యాలు
చిగురాకులు పొదవి పట్టి,
పరిరేకుల వెనుక దాచినట్టు,
నాకన్నీటి వర్షాలను
కనురెప్పలతో పట్టి
చిరునవ్వుల తెరల వెనుక నిగూఢం చేస్తా!
ఉన్నతత్వంలో పడి
ఉన్న–తత్వపుజాడలు తెలుసుకోవు!

నేను అపురూపమనుకున్నవన్నీ
అనుమతైనా లేకుండా
ఆవురావురుమని దోచుకుంటావు
నాకు మాత్రం ఏ అనుభూతి తాలూకు
అనవాలైనా మిగల్చవు!

ఐనా నీకోసం నేను
నిరంతరం ఖాళీ అవుతూండే
ఎదనిండా
ఎన్నో భవితవ్యపు

**ఆశలు నింపుకుంటా!**

శ్రమించే నాకు
స్వేచ్ఛ నిచ్చాననుకుంటావు
భరించే వన్నీ
బాధ్యతలనుకుంటావు
బ్రతుకు కోసం మౌనమైపోతా!

# స్త్రీ

ప్రకృతినేను
విశ్రమించు
సేద దీర్చుతాను

సౌందర్యంనేను!
వీక్షించు
ఆహ్లాదమిస్తాను
సౌకుమార్యం నేను
స్పర్శించు
అనుభూతినిస్తాను

మౌనం నేను
మీటి చూడు
అనురాగాన్నిస్తాను

సౌఖ్యం నేను!
ఆస్వాదించు
మాధుర్య మౌతాను

క్షేత్రం నేను!
బీజీకరించు
జాతి నిస్తాను

ధేనువు నేను!
గారవించు
అమృతాన్నిస్తాను

క్షమను నేను !
గుర్తించు
సేవలందిస్తాను

సంపూర్ణ నేను !
స్నేహించు
పరిపూర్ణతనిస్తాను
సమస్తం నేను
పరికించు
విశ్వమై నిలుస్తాను

# నాతరం

అమ్మమ్మ చెప్పింది
అణిగి మణిగి ఉండమని!
అమ్మ చెప్పింది
ఆధిక్యం పనికిరాదని!
అక్కయ్య చెప్పింది
అరిటాకు నీవని!
అన్నయ్య నిజంచేశాడు
తనకంటె నేను బలహీనమని!

నాన్న కూడా అన్నాడు
నీకు నీవుగా గుర్తింపు లేదని!
తండ్రిలోనో, భర్తలోనో
అన్నలోనో, కొడుకులోనో
లీనమవమని!

అంతరంగం అభ్యంతరం చెప్పింది
అంతరాలు లేనేలేవు,
అడుగడుగూ ముందు కేయమని!

నీ వెంట రావడానికి
వెనుక మరోతరం
వేగిర పడుతూంది
ఆతరానికి నీతరం
అడ్డంగా వుంది
హడావిడి పడి
ముందుకు నడు అంది!

# అమ్మ మనసు

నువ్వు మొదటసారి
గర్భాన కదలినపుడు
పరమానందం కలిగింది
నను అమ్మను చేస్తున్నావని!

నిద్రరానీ కుండా కదులుతూ
హడావిడి చేస్తుంటే
ఉత్సాహంగా అనిపించింది
ఉషారయిన వాడివని!

నను చీల్చుకుని ఈలోకంలోకి వచ్చాక
మమకారం పొంగులు వారింది
నా ప్రతిరూపానివని

నారక్తాన్ని పాలుగా తాగుతుంటే
బోలెడంత ఆశ కలిగింది
అందరికంటె బలవంతుడవ్వాలని!

తప్పటడుగులు వేస్తూ
ఇల్లంతా తిరుగుతుంటే
తుట్టుకోలేనంత ఆనందం పొంగింది
నీకాళ్ళమీద నీవు నిలబడగలవని!

ఆ అడుగుల్లోనే నాకు దూరమయితే
ఆశీర్వదించాలని పించింది
గొప్పవాడి నవ్వమని!

జీవన వత్తిడిలో పడి
నన్ను మరచిపోతే
కొండంత ధైర్యం వచ్చింది
నేను లేకపోయినా బ్రతగ్గలవని !

ప్రాణం పోయేటపుడు
కంటతడి పెట్టనందుకు
తృప్తిగా వుంది
నీకు తట్టుకునే శక్తి ఉందని !

ఇపుడే నాక్కొంచెం బాధగా వుంది
అందరూ నేపోయానని ఏడుస్తుంటే
నను కాల్చేటపుడు
నీచేయి కాల్తుందేమొనని !

# ఈ రోజు నవ్వింది

ఈరోజు నన్ను చూసి నవ్వింది!
నిలువుటద్దాన్ని
నాముందు పెట్టి
రేగిన చుట్టు
చిరిగిన కట్టు
చెదిరిన బొట్టు
మాసిన బ్రతుకంటూ,

అద్దంలో నా రూపం
వెక్కివెక్కి ఏడ్చేలా
పగల బడి నవ్వింది!

నేను కూడా యుగాల ఆదిలో
ఈరోజు కంటె ఎంతో ఆరోగ్యంగా
మరెంతో అందంగా
ప్రకృతినే శాసించగలిగి
మానవ జాతిని పరిపాలించే
అధికారపు హోదాలో ఉన్నాను!

రాను రాను
సృష్టికార్యంలో బలహీనమై
జిత్తులమారుల పెంపుడు చిలకనయ్యాను
నన్ను పంజరంలో పెట్టి

ప్రకృతినుండి యిష్టాయిష్టాలనుండి
విడదీసి, ఏమార్చి

గర్భగుడిలో నిలవేసి
దేవిపూజలు చేసి
ఇతిహాసపు సాంబ్రాణి పొగలో
సహగమనపు హరతులిచ్చారు ?

బయటకు వస్తే మైలపడతావని
ధర్మ శాస్త్రాలను కాపలా ఉంచారు.

మళ్ళీ నన్ను చేయిపట్టి
బయటకీడ్చి ప్రబంధాలకు
వేలంలో అమ్మివేసి
భావిభారతపు వారసత్వం మాదన్నారు!

ముందు ముందు స్వాతంత్ర్య వచ్చాకయినా
నా స్వాతంత్ర్యం నిలుస్తుందను కున్నా!
అర్థరాత్రి రోడ్డు మీద కాదు
నాకాళ్ళమీదనే నిలబడ గలనను కున్నా!

నడకలు నేరుస్తున్న
కాళ్ళను విరగొట్టి
నడిచే రైలులో
నిర్దాక్షిణ్యంగా
పీక్కుతినే శునకాల
స్వైర విహారానికి
వచ్చిన స్వాతంత్ర్యమిది
నడిరోడ్డుమీద
పిడిబాకుల స్వాతంత్ర్యమిది!

# స్పర్శించాల్సి ఉంది

అంకితం కాని కావ్యాన్ని
అర్థ కాని పదాన్ని
సూత్రం లేని సిద్ధాంతాన్ని
పరిపూర్ణతలేని జీవితాన్ని
నేనింకా శోధించవలసే ఉంది.
సాధించిన దానిలో లోపం ఏదో ఉంది

లోకపు మనసుల్లోకి
సుధీర్ఘ ప్రయాణం చేసినా
గమ్యం లేని గమనమిది
నేనేమిటో నాకు తెలీని మధనమిది
కాసేపు సంతోషమై
కాసేపు దుఃఖమై
అంతలోనే శాంతమై
వెంటనే ఆవేశమై
శాశ్వతమయిన ఏ భావనా
స్పందించలే దింతవరకూ
ఈ హృదయం !

చీకట్లో నన్నుంచి
అప్పుడప్పుడూ అగ్గిపుల్లగీసి
ఈ ప్రపంచాన్ని చూపెడుతుంది
గాఢమైన వెలుతుర్ని
కాంతి మేసిన మెదడుతో
దర్శించాల్సి ఉంది

లోకపు నాలుగు దిక్కుల్ని
ఏకం చేసి
ప్రపంచపు సిద్ధాంతాన్ని
జీర్ణం చేసుకుని
శరీరాన్ని తూర్పుచేసి
నా గుండె ఉదయించాల్సివుంది
నులి కిరణమై హృదయాలను
స్పర్శించాల్సి ఉంది!

# నేటి మహిళ

గుండె మండి
గొంతు నిండి
ఆక్రోశిస్తున్నది
అన్యాయ మన్యాయమని!

అబలత్వపు సూక్తులు
చేతకాని నీతులు
వినరాదిక
అనవసర మనవసరమని!

అంతః పురవాసం లేదిప్పుడు
స్త్రీ ఆలమందలో ఒకటి కాదిప్పుడు
లలిత కళల కాణాచి మాత్రమే కాదు
కదన రంగ వ్యూహకర్త కూడా!

నడుం కట్టి శ్రమిస్తా
నాలో శక్తిని ప్రేరేపిస్తా
ఆది శక్తిగ అవతరించి
నేనూ ఈ లోకంలో
సాటిలేని మేటిన నిపిస్తానది
ఆ త్రతతోవేగిరపడుతున్నది!

అబలను కానిప్పుడు
బలం పుంజుకున్నా
లలనను కానిప్పుడు
లాలిత్యం చంపుకున్నా!

పూలబంతులాట మానేసి
బ్రతుకు పోరాటంలో
కదం తొక్కుతూ
ముందు వరుసలోనిలుచున్నా
వెనుకంజ వేయనుగాక వేయనని

ప్రతిజ్ఞ పూనుతున్నది
ప్రతిభను చూపుతున్నది
ఇనుమడించిన ఉత్సాహంతో
రెట్టింపు శ్రమిస్తున్నది!

కానీపాపం
నిన్నరేపులకు మధ్య
నిలకడలేక నలుగుతున్నది
సూర్యుని తో బాటు పరిభ్రమిస్తు,
విశ్రాంతిని కోల్పోతున్నది
స్వేచ్ఛ పేరుతో బాధ్యత
సమానత్వం పేరుతో సమస్యలు.
పెంచు కోవడమేకాని
పంచుకునే వారు లేక
తల్లడిల్లుతున్నది
తపన పడుతున్నది

# ఆలోచన

ఆలోచన లేకేమో మరి
ఈ రోజు మౌనమయ్యాను
రేపు ఆమరునాడు కూడా నిర్లిప్తం కాలేను

అదుగో సూర్యోదయానికి ముందే
ప్రపంచం నిద్ర లేస్తోంది
ఉరకలతో పరుగులతో
అడుగడుగూ ముందు కేస్తుంది.

పూటకో కొత్తదనం
రోజుకో సిద్ధాంతం
వయసులేదు, అంతస్తులేదు
ఆడా మగా తేడా లేదు
అందరూ కలిసి స్రవంతై
అడుగడుగూ ముందుకేస్తూంది.

మరి
నాలోనేనే ఎన్నాళ్ళు ఈ బందీ
బయటకు వచ్చి వాళ్ళలో కలుస్తె
నేనూ వాళ్ళలో ఒకరిని కానూ!
మరి నాకేం పట్టనట్టు
తలుపులు మూసుకుని
కారాగార వాసమెందుకు?

అమాయ కత్వానికి
రాణీవాసం పేరెందుకు

మూర్ఖత్వానికి
బింకపు పోకడలెందుకు
చేతకాని తనానికి
సిరిసంపదల అడ్డెందుకు ?

అన్నీ విడిచి నేనూ స్రవంతిలో
నీటిచుక్కనై మేళవిస్తా!

# ఘర్షణ

చెల్లెమ్మా అని పిలుస్తూనే
చూపుల సూదులు గుచ్చినా
అన్నమ్మా అంటూనే
ఆపాదమస్తకం పరీక్షించినా

కూర్చోమ్మా అని సీటిచ్చి
బ్రేకులకు మీద పడినా
ఏదో తీసుకుంటున్న నెపంతో
కొసవేళ్ళు తాకినా

డిక్టేషన్ వుంది రమ్మంటూ
హోటల్ కెళ్దాం రమ్మన్నా
సిటీబస్ వత్తిడిలో
ఒళ్ళంతా తడిమినా

దేవుని దర్శనపుక్యూలో
వెనుకా ముందూ వత్తుకున్నా
నేనేం పట్టించు కోను
ఎదురించి గోలచేసుకోను

ఎందుకంటే
నేను స్పర్శజ్ఞానం కోల్పోయిన
మొద్దుబారిన ఆడదాన్ని

అన్నింటినీ సహించి
బ్రతికే మొండితనాన్ని
ఎదురు తిరగడం మొదలెడితే

ప్రతీక్షణం ఘర్షణే
నీ కక్కుర్తి చేష్టలకు
నిన్ను హత్య చేయాలనిపించినా
ఏం చెయ్యలేను నేను
నా శరీరం భరించినా
మనసు మాత్రం ఊరుకోదు

అసహ్యం నిండిన కన్నులతో
జుగుప్సగా నిన్ను గుచ్చితీరుతుంది!
నిన్ను శవంగా చూసితీరుతుంది

# కూపం

నీ ఆలోచనలు అదిమిపట్టి
నీ ఆశలు నొక్కిపట్టి
నీ ఆశయాలు వదులు కొని
నీ అభిప్రాయాలు అణచివేసి

మౌనమై నిశ్శబ్దమై
ఏ నిర్ణయమూ తీసుకోలేక
ఎదుటి వాళ్ళను సుఖపెడుతూ
నీ సుఖంనుండి వేరు పడుతూ
సమర్థతను మరచి

అసమర్థతను ప్రదర్శించి
జీవించి నన్నాళ్ళు మాత్రమే
నీవు పతి వ్రతవు
వీటిలో ఏ ఒక్కటి విడిచి
ఎదగాలని ప్రయత్నించినా
ఏ రేఖను దాటాలని యత్నించినా
నీవు అపవిత్రవు
సంఘం దృష్టిలో పతితవు

అందుకే ఓ పతివ్రతా
నీ బ్రతుకొక కూపం
నీ వొక మండూకం!

# కేంద్రం

ఇంకా దినకరుడు
మొదలు పెట్టనే లేదు దిన చర్య
అప్పటికే మొదలవు తుంది
అమ్మ జన చర్య!

ఏమోయ్ షేవింగ్ బాక్స్ ఎక్కడ
శ్రీ వారి కేక

అమ్మా ఆకలి టిఫిన్ కావాలి
చంటి వాడి పిలుపు

అమ్మా నాడ్రస్ ఐరన్ చేయి
పిల్లదాని పిలుపు

అమ్మా నానోట్‌బుక్ కనిపించడంలేదు
పెద్దవాడి అరుపు

ఇంకా కాఫీ పెట్టలేదా తల్లీ
మామగారి మాట

అమ్మా బట్టలు వేయి
చాకలి గొంతు

అమ్మా గిన్నెలు తోమాలా
పని మనిషి పలకరింపు

అమ్మా పేపర్ బిల్
బయట నుంచి

అమ్మా పాలు పోయించుకో
పాలవాడి అలికిడి

అమ్మా నాకు టై కట్టు
మూడో వాడి తొందర

కాస్త పంచదార ఇస్తావూ
పక్కింటావిడ అర్థింపు

స్టౌమీద కుక్కర్ ఆగకుండా
చేసే సైరన్ చప్పుడు

కూరేదో మాడిపోతున్న
వాసన నాసికకు

సుప్రభాతం నుండి
చంద్రోదయం దాకా
ఇలా అష్టావధానాలూ
అలా శతావధానాలు చేసేది

ప్రతి ఇంట్లో
అమ్మ ఒక్కతే
ఇంటిల్లి పాది అవసరాలకు కేంద్రం
అమ్మ ఒక్కతే

ఆకాశంలోని పాలపుంత గమనంలా
సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాల కూటమిలా
అమ్మ చుట్టూ అల్లుకు తిరిగేదే
ఈ జగతిలోని జీవన మంతా!
అమ్మే ఈ సృష్టికి మూల మంతా.

# ఎదురు తిరిగిన మనిషి

ఆశయాల తోనో
ఆవేశం తోనో
ఆవేదన తోనో
అలజడి తోనో

ఓ ఎదురు తిరిగిన మనిషీ!

నీ ముందు నిను మెచ్చుకుంటూ
నువ్వే తమకు ఆదర్శమంటూ
నిన్ను సన్మానించాలంటు
నీ చుట్టూ డప్పులు కొడుతూ
నీ ముందు టక్కులు పోతూ
ప్రదక్షిణాలు చేసే ప్రజల్నిచూసి,

లోకం మారిందని
మూర్ఖం వదిలిందని
జయం నీదేనని
మురిసి పోతు మైమరిచి పోకు!

నీవు వెనుకకు తిరగగానే
నీ గుండెకు గుండు సూదులు గుచ్చి
నరాలలో యాసిడ్ నింపి
కండరాల్ని ఆవిర్లో ఉండికించి
నిన్ను నిర్జీవం చేయాలని
పథకాలు పన్నుతున్నారు
పంతాలు పూను తున్నారు!

నీ ఆ దర్వాలకు మాటుపెట్టి
నీ హక్కులకు గాటుపెట్టి
నీ తలకు రేటు కట్టి
అణిగిమణిగిన జాతికి
ఆది శక్తిని పురిటిలోనే తుంచాలని
మారణాయుధాలు నూరుతున్నారు!

అందుకే
ఎదురు తిరిగి ఎదపగిలినా
ఒక్కసారి ముందడుగువేశాక
వెనక్కి మాత్రం చూడబోకు
ముందుగొయ్యి వెనుకమయ్యి
గోతిలో పడితే లేవొచ్చు
నూతిలో మాత్రం జారబోకు!

కొత్త తత్వం మొదలెట్టు
ఇప్పటికైనా
నిన్ను నీవు ధైర్యంగా ప్రేమించుకో
నిన్ను నీవు నూతనంగా నిర్మించుకో!
(తస్లిమాకు)

# ఆడ పిల్ల

ఆడపిల్లను నేను!
ఆడ ఈడ అంటూ
చేంతాడు జీవితం
చేతిఆటకు బంతిని నేను!

పుట్టింట్లో ఆడ దాని వంటూ
ఇంటిల్లి పాది చాకీరీకి
పెట్టని నౌఖరు నేను!
అత్తింట్లో ఈడ దాని వంటూ
అను క్షణం పద్మావ్యూహపు
పన్నాగాలకు బలిని నేను!

భర్తను భరించే మౌనాన్ని,
పిల్లల్ని పెంచే శాంతాన్ని,
వృద్ధుల్ని చూసుకునే ఓపికని,
ఆదాయం పంచే శక్తిని,
బాధ్యతలు మోసే వివేకాన్ని!

అన్నింటినీ మించి అనంతాన్ని!
పుట్టుకనుంచీ మరణం వరకూ
ఏదో ఒక పనిలో తీరిక లేని యంత్రాన్ని!

# యానం

కదిలే జీవితపురైలుకు
ఒకే ఒక్కబోగీ

అమ్మా,నాన్న, తమ్ముడు
చెల్లెలు నేను
కదిలే ప్రపంచాన్ని
పెద్ద పెద్ద కళ్ళతో చూస్తూ

అనుభవం లేని జీవితాన్ని
ఆట పాటలతో గడిపేస్తూ!

ఆడు కుంటున్న నన్ను
పెద్దదాని వయ్యావని
ఒక అయ్య చేతికి అందించి
అందరూ మొదటి స్టేషనులోనే
దిగిపోయారు

ఒంటరి తనానికి ఒక తోడుగా
అతను నేనూ కలిసి
ఆనంద లహరిగా కొన్నాళ్ళు

రెండవ స్టేషన్ లో
చక్కని చుక్కల్లాంటి
పిల్లలిద్దరు మాకు తోడుగా

జీవితపు గమనంలోకి
అల్లరిగా ప్రవేశించారు
ఆటలు పాటలు
భాధ్యతలు బరువులు

తీరికలేని జీవితం

వాళ్ళంతట వాళ్ళే
జీవితాన్ని వెతుక్కుంటూ
మమ్మల్ని విడిచి
ముందున్న స్టేషన్‌లో
సంతోషంగా దిగిపోయారు

బ్రతకడ మెలా అని
నేను దిగులు పడుతుంటే
నేనున్నాగా అని అతనన్నాడు
కొన్నాళ్ళు ఇద్దరం బరువుగా
ప్రయాణం చేస్తూనే వున్నాం
సుదీర్ఘంగా మౌనంగా

ఉన్న ఒక్కతోడు అతను
వీడ్కోలు నీకంటూ.
అందుకున్న చేయి

అర్ధాంతరంగా విడిచి పెట్టి
మరో స్టేషనులో
ఒంటరి దాన్ని చేసి
హృదయాన్ని తీసుకుని
బ్రతుకుని దోచేసి
నన్ను విడచి
తాను మాత్రం దిగిపోయాడు

ఇప్పుడు ఒంటరిగా
నాకు నేను తోడుగా
కదిలే లోకాన్ని

కదలిక లేకుండా చూస్తూ

అపుడపుడు నన్ను విడిచి
దిగిపోయిన నావాళ్ళ
జాడలు వేదనై
నా కళ్ళు తడుపుతూ

నా స్టేషనుకు ఇంకా
ఎంత కాలం పడుతుందో
ఎప్పుడు దిగాల్సి వస్తుందో
తెలీక కలవర పడుతూ
ఒక్కదాన్నే . . . . .

# ధిక్కారం

కవితా సంపుటి

శ్రీలత



శ్రీలతకు తన చుట్టూ ఉన్న సంఘాన్ని, సంఘటనలను పరిశీలించే శక్తి ఉంది. స్పందించే గుణం ఉంది. ఆలోచించగలదు. సమాజంలో ఆర్తికి ఆక్రోశించే హృదయం ఉంది. వ్యవస్థలో అన్యాయాన్ని ప్రశ్నించి ధిక్కరించే ధైర్యం ఉంది.

ఈమె ఇంతకు ముందు కవయిత్రుల కన్నా భిన్న వస్తువులను గ్రహించింది. ఒకవేళ అవే వస్తువులను గ్రహించినా కొత్త కోణంలో దర్శించి ప్రదర్శించింది.

కవిత్వం ఎప్పుడూ అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టుండాలా అని ఎదురు తిరుగుతుంటాను. ఇప్పటికీ నేను మారలేదు. అయితే సూటిగా చెప్పినా ఒక్కొసారి కవిత్వం అవుతుందని ఒప్పుకోవాలనుకుంటాను. వస్తు బలం కూడా కవిత్వబలంగా పరిణమించగలదనుకుంటాను.

**చేకూరి రామారావు**